# సమర్థ సద్గురు

## ఆధ్యాత్మిక మాసపత్రిక

శ్రీకాళీగార్డెన్స్ ఆశ్రమం - 522508, గుంటూరు జిల్లా

ఫోన్: (0863) 2293645, 2293862, 2293280, 2293206, 9299656267

web: www.mathaji-babuji.org samardhasadguru@rediffmail.com



సంపాదక వర్గము

**గూడూరి వెంకటరత్నం**
**డి.జె. బాలకృష్ణ లాల్**
**డా॥ ఎన్.రామతారక వరబ్రహ్మశాస్త్రి**
**మిస్.పి. ఇందిరాదేవి**
**డా॥ వి.వి.ఆర్. ప్రసాదరావు**
**డా॥ యమ్.స్వర్ణముఖి**



Volume 31 Issue 6
No.of Pages 40
FEBRUARY 2012

| | | |
|---|---|---|
| 5సం॥లచందా | రు. | 250.00 |
| 2సం॥ల చందా | రు. | 120.00 |
| సంవత్సర చందా | రు. | 60.00 |
| విడిప్రతి వెల ..... .. | రు. | 5.00 |

బ్యాంక్ డ్రాఫ్ట్A/C.Y.S.C.K.P.M చారిటబుల్ ట్రస్ట్ పేరులో డ్రా చేయండి. M.O.,బ్యాంక్ డ్రాఫ్ట్ పంపవలసిన చిరునామా:

మేనేజరు
సమర్థసద్గురు మాగజైన్
శ్రీకాళీగార్డెన్స్-522508

Printed, Published by C.V. Ramana Babu, on behalf of YOGINI SRI CHANDRA KALI PRASADA MATHAJI CHARITABLE TRUST and Printed at Samardha Sadguru Publications, D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh, and published at D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh. Editor - DUGGIRALA JAGANMOHANA BALA KRISHNA LAL


| ఈ సంచికలో.... | పేజీ |
|---|---|

| భద్రవాక్యం | 2 |
| అమ్మ ఆశీస్సులు | 3 |
| బాబూజీ ఉవాచ | 4 |
| మాతాజీ అభిభాషణ | 6 |
| సన్నిధిలో సంభాషణ | 9 |
| శ్రీకాళీగార్డెన్స్‌లో కార్యక్రమాలు | 11 |
| ప్రభూ తవాస్మిన్ | 12 |
| గురు కృపాహి కేవలమ్ | 14 |
| శ్రీకృష్ణ కర్ణామృతం | 17 |
| పరిప్రశ్నేన సేవయా | 19 |
| శివానందలహరి | 20 |
| తీర్థయాత్రా ఫలితం | 22 |
| నాడు-నేడు | 24 |
| నూతన సంవత్సర సందేశం | 26 |
| సమర్థ సద్గురు నాథుని దివ్యచరిత్ర | 28 |
| అపరోక్షానుభూతి | 31 |
| బెంగుళూరులో శ్రీమాతాజీ సత్సంగం | 33 |
| మాణిక్యవాచాకర్ | 35 |
| త్యాగి | 37 |
| విష్ణు కథలు | 38 |

# భద్రవాక్యం

-పరాశర ప్రసాద్

***స్థిత ప్రజ్ఞ్యస్యకా భాషా సమాధిస్తస్య కేశవ ।***
***స్థితధీః కిం ప్రభాషేత? కిమాసీత ? వ్రజేత కిమ్?*** - భగవద్గీత

అర్జునుడు గీతాచార్యుడైన శ్రీకృష్ణ భగవానుని ప్రశ్నిస్తూ కేశవా! స్థిత ప్రజ్ఞుడు ఎలా ఉంటాడు? ఎలా సంభాషిస్తాడు? ఎలా కూర్చుంటాడు? అతనిని ఎలా గుర్తించటం? అని అడిగాడు.

ఇంద్రియాలు మనస్సులోనూ, మనస్సు బుద్ధిలోనూ, బుద్ధి ఆత్మలోనూ లయమైనప్పుడు ఏ వికల్పాలు లేని నిర్వికల్ప సమాధి స్థితిలో ఉన్నవాడే స్థితప్రజ్ఞుడు. మనస్సులో సంకల్పాలు జనించినప్పుడు ఆ మనస్సు ఇంద్రియాల ద్వారా బహిర్ముఖమై గోచరించేదే జగత్తు. అదే సంసారముగా వ్యవహరింప బడుతుంది. అలా కాకుండా బుద్ధి ఆత్మలో లయించినప్పుడు, మనస్సు ఇంద్రియాలు అంతర్ముఖమై మనస్సులోని కామ వికారాలన్నీ హరింపబడి, బ్రహ్మముపై అధ్యారోపితమైన, జగత్తు కరిగిపోయి బ్రహ్మమే సాక్షాత్కరిస్తుంది. ఈ అనుభూతిని పొందుతున్నవాడు స్వయం తృప్తుడుగా ఉంటాడు. అతనికి అసంతృప్తి, దుఃఖము వంటి అనుభూతులుండవు.

ఈ ఆధ్యాత్మిక వికాసము కేవలం వేదాంత గ్రంథాల్లో వివరించబడినదో లేక మనస్సులో ఊహించి సూచన ప్రాయంగా తెలియజేయబడినదో కాదు. ఇది సాధకుడు తన నిజ జీవితంలో సాధించి అనుభవంలోకి తెచ్చుకోగలిగినది. ఆత్మ వికాసము పొంది నిర్వకల్ప సమాధి నిష్ఠుడైన స్థితప్రజ్ఞుడు చూడటానికి మానవుడి ఆకారంలో ఉన్నా, అతనిని సాధరణ వ్యక్తిగా భావించటానికి వీలులేదు. అతనిలో త్రిగుణాలు, ద్వందములు పూర్తిగా హరించి ఉంటాయి. అతను తన స్వరూప స్థితిని పొందిన సచ్చిదానంద పరబ్రహ్మ స్వరూపుడు. ఆధ్యాత్మిక సాధన సాధకుని జీవితాన్ని అలా మార్చివేస్తుంది.కేవలం ఆశయాలు, భావాలు, ఆలోచనలు మారినంత మాత్రంచేత సరిపోదు. వ్యక్తిత్వం పూర్తిగా మారిపోవాలి. వ్యక్తిత్వంలో సత్యస్వరూపమైన బ్రహ్మమే ప్రకాశించాలి. అది సద్గురుమూర్తి అనుగ్రహం ద్వారా ఫలిస్తుంది.

**పరాశర ప్రసాద్**
**గౌరవ సంపాదకులు**

# అమ్మ ఆశీస్సులు

శ్రీసద్గురుదేవుల పరిపూర్ణ అనుగ్రహముతో శ్రీవారు ప్రసాదించిన పంచాహ్నిక **శ్రీసద్గురు మహాసౌర యాగము** గుంటూరులో ఎంతో వైభవంగా జరిపించారు. ఎంతోమంది భక్తుల సహాయ సహకారాలతో, సేవలతో యాగ కార్యక్రమం కన్నుల పండుగగా జరిగింది. ఎంతోమంది సాధుమహాత్ములు దివ్య సందేశములను, వారి దివ్య ఆశీస్సులను ప్రసాదించారు. ఈ దివ్య కార్యక్రమమును గుంటూరు శ్రీబాబూ భక్తసమాజ్‌వారు ఎంతో భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. కార్యకారణములు శ్రీసద్గురుదేవుల ప్రసాదమే కనుక భక్తజనులందరికీ తృప్తితో కూడిన ఆనందమైంది.

జగమే నీ దయ సర్వము నీ దయ
నీ దయ లేనిదే యేదియూ లేదయా
నీదికానిదే ఏదియూ లేదయా
జగమూ నీవేనయ్యా సర్వము నీవేనయా
నీవు లేనిదే ఏదియూ లేనే లేదయా

జీవుడు పరమాత్మ అన్నీ నీవే ప్రభూ! మనోవాక్యా కర్మములు సర్వవ్యాపియైన ప్రభువే అన్నీ తానేయై ఉండి నడిపిస్తున్నారు. మనకీ జన్మను ప్రసాదించి అట్టి సత్యమును గుర్తించి అనుభవించమన్నారు. అందుకనే శ్రీగురుదేవులు వారి భాషణలో అంటుండేవారు అది అనుభవేకవేద్యమైనది.

ఇంతలోనే మనకు మహాశివరాత్రి 20వ తారీఖున రాబోతోంది. నిరాకారమైన ఈశ్వరుడు లింగాకృతిలో అభిషేకములను అందుకుంటాడు. ***నా రుద్రో రుద్రమర్చయేత్*** అని తనను పూజించే వారందరనీ రుద్రుణ్ణి చేసి పెడుతున్నాడు. మానవుడై ఉండి శ్రీగురువులను ఆశ్రయించిన వానికి కూడా మహాత్ములు హెచ్చరికగా బోధిస్తూ..........

శివ శివ అనరాదా శివనామము చేదా
శివ పాదముమీద నీ శిరసునుంచ రాదా
భవ సాగర మీద దుర్భర వేదన లేదా ॥శివ॥

భవము పుట్టకనే లేకుండా చేస్తున్నారు మహాత్ములు. అట్టి సౌభాగ్యమును, సాధన సంపత్తిని శ్రీగురుదేవులు మనందరికీ ప్రసాదించుగాక!

శ్రీసద్గురు సేవలో
మీ అమ్మ

# బాబూజీ ఉవాచ

(గతసంచిక తరువాయి) - వెంకట రమణ ప్రసాద్

"మహర్షీ! యిది నా భాగ్యం!" అన్నాడు శ్రీకృష్ణ పరమాత్ముడు. దూర్వాస మహర్షికి ఆయన శిష్యగణానికి ప్రశాంతంగాను, వారి తపోధ్యానాదులకు అనుకూలంగానూ ఉండే కుటీరాలను నగరానికి కొంచెం దూరంగా, నదికి ఆవలి ఒడ్డున ఉండేటట్లు ఒక చక్కని తోటలో వేయించి, వారికి కావలసిన సర్వోపకరణాలతో అక్కడ ఒక బస యేర్పాటు చేయించాడు.



మహాత్ముడైన ఆ అతిథికి స్వయంగా రుక్మిణీమాత ప్రతిరోజూ భోజనం తీసుకు వెళ్ళే ఏర్పాటు జరిగింది. ఆమె వినమ్రంగా పాదచారియై, పాదరక్షలు ధరించకుండా రోజూ మహర్షికి భోజనం తీసుకుని వెళ్ళేది. దారిలో ఆమె నది కూడా దాటవలసి వచ్చినా, అది అంత లోతైనది కాదు కనుక, తేలికగా దాటి మహర్షి ఆశ్రమం చేరగలిగేది. ఆమె శ్రద్ధా భక్తులకు ముగ్ధుడైనాడు దూర్వాస మహర్షి.

ఒకరోజు ఆమె మహర్షికి భోజనం తీసుకుని బయల్దేరే సమయానికి నదికి వరద వచ్చి దాటటానికి వీలుకాలేదు. ఎంతసేపటికీ వరద తగ్గలేదు. ఋషికి భోజనానికి ఆలస్యమవుతున్నది. అసలే దూర్వాస మహర్షి! రుక్మిణీ దేవికి ఏమి చేయాలో తోచక, ఆమె శ్రీకృష్ణుణ్ణి అడిగింది. ఆయన చిరునవ్వుతో "భయమెందుకు రుక్మిణీ! నువ్వు నది దగ్గరకు వెళ్ళి 'ఓ నదీమాతా! నేను నిత్యోపవాసికి భోజనం తీసుకుని వెళ్తున్నాను. దయచేసి దారి వదల'మని అడుగు. నది నీకు దారి యిస్తుంది" అన్నాడు. రుక్మిణీదేవి అలాగే నది దగ్గరకు వెళ్ళి, భక్తివిశ్వాసాలతో దారి యిమ్మనమని అడుగగా, నది రెండుగా చీలి దోవ యిచ్చినిది. ఆశ్చర్యానందాలతో ఆమె నది దాటి వెళ్ళి, దూర్వాస మహర్షికి వడ్డించింది. ఆరోజున దూర్వాస మహర్షి మామూలు కన్న రెండింతలు తిని, గర్రున త్రేన్చాడు. తీసుకువెళ్ళిన అన్నం మెతుకు కూడా మిగలలేదు.

మహర్షి భోజనం చేశాక తిరిగి యింటికి బయల్దేరింది రుక్మిణీదేవి. నది యింకా ఉధృతంగానే ఉంది. ఏం చేయాలో పాలుపోక ఆమె దూర్వాస మహర్షిని అడిగింది. ఆయన మందహాసం చేస్తూ "అదేమిటమ్మా! నది దగ్గరకు

వెళ్ళి, 'నిత్యబ్రహ్మచారి అయిన నా భర్త దగ్గరకు వెళ్తున్నాను. ఓ నదీమాతా! నాకు దారి వదులు' అని అడుగు. నది నీకు దారి యిస్తుంది'' అన్నాడు. రుక్మిణీదేవి దూర్వాస మహర్షి మాటలయందు విశ్వాసముంచి, ఆయన చెప్పినట్లే చేసింది. నది రెండుగా చీలి దారి యివ్వగా, యింటికి క్షేమంగా చేరుకున్నది.

అయితే ఆమె మనస్సు తికమక పడింది.తన భర్త మాటయందూ, మహర్షి మాటయందూ విశ్వాసముంచి తను నదిని యాచించటమూ, ఆ నది దారి యివ్వటమూ జరిగిందేకాని, రోజూ శుభ్రంగా భోజనం చేస్తున్న దూర్వాసుడు ఎలా నిత్యోపవాసి అయ్యాడో, తనతోనే గాక యింకా అనేకవేలమంది భార్యలతో దాంపత్య ధర్మాన్ని నిర్వర్తించే తన భర్త నిత్యబ్రహ్మచారి ఎలా అయ్యాడో, ఆమెకు ఏ మాత్రం అంతుపట్టలేదు. అయితే ఆమెకు భర్తమాట యందూ, మహర్షి మాటయందూ నమ్మకం లేకపోలేదు. ఇందులో తనకు అర్థంకాని ధర్మ సూక్ష్మం ఏదో ఉన్నదని తెలుసుకొనగల బుద్ధిమంతురాలు రుక్మిణీదేవి.

ఆ రహస్యమేమిటో తెలుసుకోవాలని నిశ్చయించుకొన్నదామె. వినయవిధేయతలతో తన భర్తను సమీపించి, తన అనుమానాలను మనవి చేసుకుని, వివరణ కోరింది రుక్మిణి. అప్పుడు శ్రీకృష్ణుడు ఆమె పరిప్రశ్నకు సంతృప్తుడై, తన చిరునవ్వు వెన్నెలలతో ఆమెలోని అజ్ఞానాంధకారాన్ని పటాపంచలు చేస్తూ యిలా వివరించాడు.

"రుక్మిణీ! ఉపవాసం అంటే అన్నం తినటం మానుకొని, శరీరాన్ని కృశింపజేయటం కాదు. మనస్సును భగవానునికి అత్యంత సన్నిహితంగా ఉంచటమే ఉపవాసమనే మాటకు అర్థం. దూర్వాసమహర్షి మనస్సు తైల ధారవలె నిరంతరమూ భగవంతుని యందే లీనమై ఉంటుంది. అందుచేత రోజూ నువ్వు తీసుకెళ్తున్న ఆహారాన్ని ఆయన సుష్టుగా తింటున్నప్పటికీ, ఆయన నిత్యోపవాసియే.

ఇక నా బ్రహ్మచర్యం సంగతి విను. అన్యవృత్తి లేక నేను సదా బ్రహ్మమునందే సంచరించేవాడిని కనుకనే నన్ను 'సదా బ్రహ్మచారి' లేక 'నిత్య బ్రహ్మచారి' అని వర్ణించాడు మహర్షి. సర్వ వ్యాపకమూ, సర్వజ్ఞత్వమూ, సర్వశక్తిమంతమూ అయిన ఆత్మ పదార్థాన్ని నేను. అలా కాకపోతే యిలా మీలాంటి వేలాది పత్నులతో ఎలా కాపురం చేయగలను? ఈ సృష్టిలోని సమస్త జీవరాసులలోనూ ఉన్న కూటస్థ చైతన్యాన్ని నేనే. అందువల్లనే నేను నిత్య బ్రహ్మచారిని.

-సశేషం

# మాతాజీ అభిభాషణ

(గత సంచిక తరువాయి) -జపమాల ప్రసాద

- ఇది బోనస్ (Bonus) అన్నమాట! కూర్మదాసు స్వామివారిని అనేక విధాల స్తుతించి, తనకి దర్శనమిచ్చిన ఆ రూపంతో, ఆ చోటనే ప్రతిష్ఠకమ్మని కోరుకుంటాడు. తన భక్తులు కోరడం ఆలస్యం - తథాస్తు అంటాడా భక్త సులభుడు. కూర్మదాసు కోరికపై పాండురంగడు అక్కడే రెండు చేతులూ నడుముకి ఇరుప్రక్కలా పెట్టుకుని నిలబడిపోయి, "నన్ను తెలుసుకుంటే నీ బ్రతుకు కూడా ఇంత ఠీవిగా వుంటుంది. నేను పొందుతున్న ఆనందాన్ని తెలుసుకుంటే, నువ్వు కూడా ఆనందంగా వుంటావు" అంటున్నాడాయన. కనుక, సాధకుడయిన వాడు తాను సాధించవలసిన లక్ష్యం కోసం ప్రయత్నం చేయాలి.



నెమ్మది నెమ్మదిగానే చేయవచ్చు. కానీ ప్రయత్నం మట్టుకు మానకూడదు. అప్పుడు గమ్యం చేరగలుగుతారు. గురుమహరాజ్ వారు ఎంతో గొప్ప జ్ఞానం గురించి, లోతయిన తత్వాన్ని గురించి చెప్పగలిగివుండి కూడా, యిటువంటి భక్తుల కథలు చెప్పించుకుని ఆనందించేవారు. భక్త విజయంలో నుండి కథలు కొంచెం చదివించి, దానిగురించి బోలెడంత బోధ చెప్పేవారు స్వామి. ఎందుకని? అటువంటి భక్తిని మనం అలవరచుకోవాలని.

నిత్యమైన దానిమీద మనస్సు నిలిచిపోతే, అనిత్యాన్ని అసలు మనం చూడలేం. ఎందుకంటే అనత్యం జడం కనుక. జడమైన అనిత్యాన్ని కూడా ప్రకాశింపచేసేది నిత్యమైన పరమాత్మ వస్తువు. భక్తుల చరిత్రలు శ్రవణం చేస్తే, వారే మార్గంలో నడచి ఆనందాన్ని పొందారు అన్నది మనకి తెలుస్తుంది. అంతమాత్రం చేత తృప్తి పడిపోకూడదు. వారు కష్టాలని ఎలా ఎదుర్కొన్నారో, ఎంత అకుంఠిత దీక్షతో సాధన చేశారో తెలుసుకుని, మనం కూడా అదే విధంగా ఆచరించిననాడు, వారు పొందినటువంటి ఆనందాన్ని మనం కూడా పొందుతాం. ఇందాక చెప్పుకున్న భక్తులలో సామంతుడు అన్న భక్తుడు పండరినాధుడు తాను విశ్రమించడానికి స్థలం చూపమంటే, తన

హృదయంలోనే కూర్చోబెట్టుకున్నాడు. మరి మన హనుమ, రాముడిని గుడిలోనూ, గూటిలోనో కూర్చోమన్నాడా? లేదే! తన గుండెలోనే దాచుకున్నాడు. ఎక్కడున్నారు సీతారాములు అంటే తన గుండెనే చీల్చి చూపెట్టాడు. అందుకే "రాముని ప్రాణం హనుమన్న - హనుమకు ఊపిరి రామన్న ఒకరు లేక ఇంకొకరు ఉండలేరు ఒక క్షణమైనా..'' (అనిపాడారు అమ్మ). భక్తుని హృదయమే భగవన్నిలయం. అందరూ కూడా ధీరత్వం కలిగివుండి, అట్టి గొప్ప స్థితిని పొంది తీరాలి.

దాసోహమ్ అనే భావనతో భగవంతుడిని సేవించడం మొదలుపెడితే, అది 'సోహమ్' భావనకి తీసుకువెళుతుంది. ఈ విషయం స్కందోపనిషత్తులో చాలా చక్కగా వివరించి చెప్పబడింది. 'సోహమ్ భావేన పూజయేత్' - 'ఆ పరమాత్మ వస్తువే అసలు నేను' అనే భావంతో నిరంతరం శ్వాసద్వారా, అజపగాయత్రి జరుగుతూ వుంటే, అభేదమైన తత్వం గోచరిస్తుంది. అదే "అభేద దర్శనం జ్ఞానం'' అని చెప్పబడింది. అట్టి స్థితిలో ఇక మనసులో సంకల్పాలకి, విషయాలకి తావెక్కడ వుంటుంది? దానినే "ధ్యానం నిర్విషయం మన:'' అన్నారు. అన్నీ నాకే కావాలి అని అనుకునేవాడికి ధ్యానం నిలవదు. ఇటువంటి స్థితిని పొందడానికి కొన్ని నియమాలని చెప్పింది ఉపనిషత్: **"స్నానం మనోమల త్యాగః। శౌచమింద్రియ నిగ్రహః''** "మనసులో జన్మజన్మాంతరాల నుండి పేరుకుపోయిన వాసనలు, విషయాలు మొదలయిన మలాన్ని విడిచిపెట్టడమే స్నానం. ఇంద్రియ నిగ్రహం కలిగి వుండడమే శౌచం (మడి). కేవలం తడిబట్టలు కట్టుకోవడం మడికాదు. ఇటువంటి శౌచం కలిగివున్నవాడు ఎంతమందిలోనైనా ఉండగలడు. ఏకాంతంలోనూ హాయిగా వుంటాడు. నిరంతరం బ్రహ్మామృతాన్ని సేవించాలి. భిక్షరూపంలో, దేహరక్షణకి కావలసినంత మాత్రమే భుజించాలి అని కూడా చెప్తోంది ఈ స్కందోపనిషత్తు - **"బ్రహ్మామృతం పిబేత్, భైక్ష్య మాచరేత్ దేహరక్షణే''**

ఇలా చేయడం వలన ఏమిటి తెలుస్తుంది? "దేహో దేవాలయ ప్రోక్తః । జీవోదేవ స్సనాతనః। (సదాశివ:) ఈ విధంగా చక్కగా నియమ నిష్ఠలతో ఏ బుద్ధిమంతు డయితే సాధన చేస్తాడో, అప్పుడీ దేహమే దేవాలయమని, అందులోని జీవుడే సనాతనుడై సదాశివుడని తెలుసుకుని జీవించి ఉండగానే ముక్తిని పొందుతాడు. ఇటువంటి స్థితిలో ప్రకాశిస్తున్న మహాత్ములని బయట శబ్దాలు ఏమీ భంగపరచలేవు. లోపల నిశ్శబ్దం అవ్వాలి. అట్టి స్థితిని చేరుకున్నాక

మనం బజారులో వున్నా మనసు మాత్రం పరమాత్మపైనే వుంటుంది. మనం బజారులో వుండవచ్చు గానీ, బజారు మన మనస్సులో వుండకూడదు. అటువంటి ఏకాగ్రచిత్తం కలిగి, దేహభావన మరచి, నిరంతరం బ్రహ్మనిష్ఠలోనే వుండేవాడు అస్ఖలిత బ్రహ్మచారి.

మనలో ఉండే జీవుడే రాధ. మనని ప్రకాశింపచేసే పరమాత్మే కృష్ణుడు. జీవాత్మ పరమాత్మల కలయికే 'రాసలీల'. ఇది నిరంతరం జరుగుతూ ఉండవలసిందే. పరమాత్మతో లింకు విడిపోతే, ఇక ఏడుకట్ల సవారీయే.

చూశారా, గురుమూర్తి ప్రసాదించిన లక్ష్యార్థమనే చిన్న మంత్రరూపంలో వున్న విత్తనంలో ఎంతటి మహత్తర తత్వం దాగివుందో! దానికి నిరంతర సాధన అనే నీరు పోస్తే చాలు. మిగతాదంతా గురునాథులే చూసుకుంటారు. సందేహం లేని భక్తిని కలిగివుండాలి. అదే అస్ఖలితమైన భక్తి. నేను తరిస్తానా లేదా అనే సందేహం, సంశయం ఉండకూడదు. గురుదేవుడి మాట మీద విశ్వాసం ఉంచి, సాధన చేయడమే మన వంతు. మనస్సుని నిరంతరం వాసుదేవునిలో వుంచడమే 'ఉపవాసం'. కనుక అటువంటి అఖండ భక్తి, జ్ఞాన, వైరాగ్యములని, అఖండ సాధనా సంపత్తిని ప్రసాదించి గురుపాదుకలు మనలని కాపాడుగాక! సుఖీభవ! సుఖీభవ!

హరిః ఓం తత్సత్

### శ్రీకృష్ణ లీలా రహస్యం

నేనూ, నా కృష్ణుడూ - మా ఇరువురితో పాటు ఇతరులు కూడా ప్రపంచంలో నాకు గోచరించిన కాలమందు, నాతో ఆయన జరిపిన లీలలన్నీ, నేను ఎవ్వరికీ వెల్లడి చేయక చాలా రహస్యంగా ఉంచుతూ వచ్చాను. అలాకాక ఇప్పుడు ప్రపంచంలో ఎల్లెడలా మా ఇరువురిని మాత్రమే నేను చూడటం నేర్చుకున్నప్పటి నుంచి నాకు సిగ్గనేది లేకుండా పోయి అంతా బట్టబయలుగా వాగేస్తున్నాను.

నేను భగవంతుణ్ణి ప్రేమిస్తున్నాను కనుక నన్నే దేముడు అధికంగా ప్రేమించాలి అంటే అది అసంభవం. ఎందుకంటే ఆయన ఒకడు. లోకంలోని అనేకులలో నీవు ఒకడవు (నానాత్వం ఉంది). నీవూ, ఆయన మటుకే లోకంలో ఉన్నప్పుడు (ఏకత్వం) అభావం రాదు. నశిస్తుంది.

-అరవిందుడు

# సన్నిధిలో సంభాషణ

(గత సంచిక తరువాయి) - పరాశర ప్రసాద్

12-6-1985

ఈ రోజు శ్రీబాబు భక్తులనుద్దేశించి మాట్లాడుతూ ధ్యానం ఎలా చేయాలో చెప్పారు. ధ్యానంలో ధీరత్వంగా కూర్చోవాలి. నిటారుగా కూర్చోవాలి. మనస్సుని చక్కగా భగవంతుని యందు ఉంచాలి. నీ దృష్టిలో ఏదైనా నీ ఇష్ట దైవాన్ని నిలుపుకోవాలి. రెండు చేతులూ కలిపి కూర్చోవాలి. వజ్రాసనము వేసుకుని కూర్చుంటే మూత్రకోశాలకు మూత్రపిండాలకు బలము చేకూరుతుంది. డయాబెటిస్ మీ దగ్గరకు చేరదు. ఎంతసేపు కూర్చో గలిగితే అంతసేపు చాలు. ధ్యానానికి కూర్చోగానే నీ మనస్సు నిలబడే వరకు కొంత ఇబ్బందిగా ఉండవచ్చు. భూత వర్తమాన కాలాలోని విషయాదుల రీల్స్ తిరుగుతాయి. జన్మజన్మల నుంచి మీరు ఆర్జించిన బీజాలు మీ హృదయం నుంచి బయలుదేరి మీ ముఖము ముందు నిలబడతాయి.

దీనికి లొంగకుండా ధ్యానాన్ని తీవ్రతరం చేశారనుకోండి అప్పుడు మీ మనస్సు అనే మాయాశక్తి మీలోని బలహీనతని వెదుకుతుంది. ముందుగా కామక్రోధాది గుణాలని ప్రేరణ చేస్తుంది. కామానికి లొంగకపోతే, క్రోధం లొంగతీయడానికి ప్రయత్నిస్తుంది. ఇవి తప్పితే ఈర్ష్య, అసూయ, అసహనం, ఓర్వలేనితనం, మోహం నిలబడతాయి. ఈ విధంగా రజో తమో గుణాలకు, ఈషణత్రయాలకు దేనికీ లొంగకుండా భగవంతుని దివ్యచరణారవిందాల పైనే దృష్టిని నిలిపితే మనస్సు నెమ్మది నెమ్మదిగా క్రిందికి ఒక స్టెప్ దిగి వస్తుంది. అలా మనస్సు ఎప్పుడైతే క్రిందికి దిగిందో ధ్యాన హోమంలో లయించిపోతుంది.

అప్పుడు మనస్సులోని మాలిన్యం తొలగి విషయవాంఛలు ఉండవు. అవన్నీ ధ్యానహోమంలో భస్మం అవుతాయి. అప్పుడు మీ మనస్సులో నిలిచిన పరమేశ్వరుడు ఆ భస్మాన్ని ధరిస్తాడు. అటువంటి మహాత్ముడే వేమన. ఆయన యోగి. మానవుడు ధ్యానం ద్వారాగా ఆరు శిఖరాలను అధిరోహించాలి. ఆరు శిఖరాల ఆవల ఉన్నది తానే. అదే ఆత్మతత్త్వము. దాన్ని తెలుసుకున్న వాడే పరమహంస స్వరూపుడు. కుటుంబ దరిద్రం తీర్చలేనివారు లోకదరిద్రాన్ని తీర్చగలుగుతారా? వారి ఇంట్లో రోగాల్ని తీర్చలేనివారు మీ రోగాల్ని తీరుస్తారా?

శాస్త్రజ్ఞానము చిలుక పలుకుల్లాంటివి. పండితులు వారు పుస్తకాలలో చదివిన విషయాలను ఎంతో నేర్పుతో తెలియజేస్తారు. కాని వారికి అనుభవం లేదు. చిలకకి మనం నేర్పితే చక్కగా 'రామ రామ' అని పలుకుతుంది. కాని పిల్లి వచ్చి దాని మెడ పట్టుకునేసరికి 'కీర్ కీర్' అంటూ ప్రాణం విడుస్తుంది. శాస్త్రజ్ఞానం కూడా అంతే. అది ఎంతవరకు మనల్ని తరింపజేస్తుంది? అంత్యకాలంలో మీ మనస్సు పరమాత్ముని యందు నిలిస్తేనే మోక్షం కలుగుతుంది. మరణ వేదన చాలబాధతో కూడినది. అది 1000 తేళ్ళు, మండ్రగబ్బలు కుడితే ఎంత బాధో అంతకన్న ఎక్కువ బాధ. అటువంటి మరణ వేదన లేకుండా ఉండాలంటే మీ మనస్సు ఆ దివ్య చరణారవిందాలపై నిలబడాలి. అందుచేతనే ఈ సాధన.

సూర్యకిరణాలు ఇంటిమీద పడినంత మాత్రాన ఇంట్లో కాంతి ఉంటుందిటయ్యా? మీ గృహంలో ఉన్న కిటికీలు, తలుపులు అన్నీ మూసి ఉంచుకుంటే కాంతిని ఎలా అందుకోగలుగుతావు? అహంకారం, మమకారం అనే తలుపులు తీస్తే వస్తు దర్శనం అవుతుంది. పాలలో వెన్నలాగ గృహస్థుడిగా ఉండి, నిన్ను ప్రకాశింపజేసే ఆత్మవస్తువుని తెలిసికోవాలి. భూమి, ఆకాశం మధ్య ఉన్న నీవు తిరగలిరాళ్ళ మధ్యపడి సంసార తాపత్రయంలో పడ్డావో నలిగిపోతావు. భూమి ఆకాశము మధ్య ఉన్న తిరగలిరాళ్ళ మధ్య ఉన్న బురుజు అనే సత్యగురువుని ఆశ్రయిస్తే ఆ తిరగలిరాళ్ళు ఏమీ చేయలేవు. మీరు జీవించి ఉండగానే ధ్యానంలో సమాధి స్థితిని పొందగలిగితే మీ జన్మను సార్థకం చేసికొన్నట్లు. లేకపోతే ఈ మానవ జన్మ నిరర్థకమే కదా! అన్నారు శ్రీబాబు.

-సశేషం

వాచ్యార్థంలోని జీవుడే లక్ష్యార్థంలోని ఈశ్వరుడు. ప్రవాహంలో కొట్టుకుపోయే దూలం ప్రవాహాన్ని రెండుగా చీల్చి ద్వైత భావము కనబరుస్తుంది. కాని ఆ దూలం తొలగిస్తే ఏక ప్రవాహమే.అంతటా ఉన్నది ఏకత్వమే. మనం భుజించిన ఆహారాన్ని వమనం చేసుకుంటే ఎంత అసహ్యకరమో ఈ ప్రాపంచిక సుఖ భోగాలూ అంతే అని తెలుసుకొనుటయే వైరాగ్యము.

-బాబూజీ

## శ్రీకాళీగార్డెన్స్‌లో విశేషపూజా కార్యక్రమములు

**ఫిబ్రవరి 2012**

**3 శుక్రవారం** భీష్మ ఏకాదశి, శ్రీ సద్గురు పాద పూజ, సత్సంగం. పెద నిండ్రకొలను శాఖలో శ్రీ సద్గురు దేవుల దివ్య మంగళమూర్తి సప్తమ ప్రతిష్టా వార్షికోత్సవం. శ్రీ సద్గురు పాద పూజ, సత్సంగం, భక్త సమారాధన.

**7 మంగళవారం** మాఘ పూర్ణిమ, శ్రీ సద్గురు పాద పూజ, సత్సంగం, భక్త సమారాధన.

**16 గురువారం** శ్రీగురుదశమి, సత్సంగం, శ్రీసద్గురుపాదపూజ

**20 సోమవారం** మాసశివరాత్రి., మహా శివరాత్రి, తె.ఝా. 3 గం.లకు బృందావనంలో శ్రీ గురుదేవులకు రుద్ర,నమక, చమక సహితంగా అభిషేకం 4 గం.లకు మహన్యాసము, 5గం.30 నిలకు శ్రీ సద్గురు పాదపూజ, 7గం.30 నిలకు సామూహిక రుద్రాభిషేకములు, 11గం.లనుండి శ్రీ రామలింగేశ్వర స్వామికి సహస్ర ఘటాభిషేకము, లక్ష బిల్వార్చన, భక్త సమారాధన, రాత్రి 6.గం. 30ని.లకు శ్రీ మహాకాళికాపరమేశ్వరీ రామలింగేశ్వరుల నగరోత్సవము రాత్రి7గం.30ని.లకు లీలా కళ్యాణము.

**24 శుక్రవారం** శ్రీ లలితానంద సరస్వతి స్వామినివారి పుణ్యారాధన మహోత్సవము, శ్రీ సద్గురు పాదపూజ, సత్సంగం, ఆరాధన కార్యక్రమము.

** **సవరణ** - జనవరి మాసపత్రికలో కాళీగార్డెన్స్ విశేషకార్యక్రమాలలో శ్రీగురుదశమి ఫిబ్రవరి 16వ తేదికి బదులుగా 17వ తేదీ అని పొరపాటుగా ప్రచురించటమైనది. పాఠకులు గమనించవలసినది.*

**మార్చి 2012**

8 గురువారం పూర్ణిమ, హోళీ, శ్రీ సద్గురు పాదపూజ.

17 శనివారం శ్రీగురుదశమి, సత్సంగం , శ్రీసద్గురుపాదపూజ

21 బుధవారం మాసశివరాత్రి

23 శుక్రవారం నందన నూతన సంవత్సరాది. పంచాంగ శ్రవణం, సత్సంగం, శ్రీసద్గురుపాదపూజ, భక్తసమారాధన.

# ప్రభూ తవాస్మిన్!

- ఆర్.టి.సి. లక్ష్మి

శ్రీవాల్మీకి మహర్షి శ్రీమద్రామాయణ గాధను ప్రపంచానికి అందిస్తూ అందులో మూడు రకాలైన సమాజాలను ఆవిష్కరించారు.

అనాగరికమైన వానర సమాజాన్నీ; ఉన్నత సామాజిక ప్రమాణాలతో కూడిన రాజవంశాన్నీ; అవినీతిలో కూరుకుపోయి, అక్రమార్జనతో సర్వ ప్రాపంచిక భోగాలనూ అనుభవిస్తూ, అంతటితో తృప్తి చెందక, అసహాయులైన తోటివారిని మానసిక, శారీరక హింసలకు గురిచేస్తూ ఎదుటివారి నిస్సహాయత్వాన్ని తమ సమర్ధతగా భావించి, తమ భుజాలను తామే చరుచుకుని ఆనందించే అతి హేయమైన, దుస్సహమైన అసుర సమాజాన్ని ఆవిష్కరించారు.

అట్టడుగు అనాగరిక వానరజాతిలో నీతి - రీతులకు అంత విలువ లేనట్లు కనిపిస్తుంది. ఉదాహరణకు తార. వాలి భార్య. అత్యంత తెలివైనదీ, పంచ కన్యలలో ఒకరు అయి ఉండి కూడా దుందుభి చేతులో వాలి మరణించాడని భావించి, సుగ్రీవుని చేరుతుంది. తరువాత వాలి జీవించే ఉన్నట్లు తెలుసుకున్న తరువాత మళ్ళీ వాలిని చేరుతుంది. తిరిగి వాలి మరణానంతరం సుగ్రీవుని చేరుతుంది. అయినా వానరులందరూ తారను తమ మహారాణిగానే భావించి వినయ విధేయులయ్యే ఉన్నారు హనుమంతునితో సహా. ఈ విషయం ఆనాటి వారి సమాజంలో సమస్యే కాదేమో అన్నట్లుగా ఉంది. ఈనాటి మన సమాజంలోనూ యిలాంటి వారు తారసపడుతూనే ఉంటారు.

ఏకపత్నీవ్రతుడుగా నేటికీ ఏకైక ఉదాహరణగా నిలచిన శ్రీరామచంద్రుని పితృభక్తి - పరిపాలకుడిగా ఆయన యొక్క సమర్ధవంతమైన బాధ్యతాయుత ప్రవర్తన - కులమతాలకతీతమైన మైత్రీ బంధం - శత్రువునైనా అతని శౌర్యాన్నీ, పరాక్రమాన్నీ, ధైర్య - సాహసాలనూ గుర్తించి, అభినందించ గలిగిన విశాల హృదం - కుటుంబ జీవిత విలువలు మొదలైన విశాషాంశాలు యీనాటికీ భారతీయ ప్రాచీన జీవన విధానానికి ప్రపంచమంతటికీ విలువను సంచరించిపెట్టాయి.

అంతులేని అక్రమార్జనతో వైభవోపేతమైన జీవితాన్ని గడుపుతూ శారీరక సుఖాలతో తృప్తిపడక భోగలాలస జీవితాన్ని అనుభవిస్తూ తమ అనుచరులకు యిస్తూ, నీతి, నియమం, ధర్మం అంటూ హిత బోధ చేసే

శ్రేయోభిలాషులను కష్టాలపాలు చేసి ఆనందించే అసుర విధానం రాక్షస పాలన కూడా చిత్రీకరించారు. రావణాసురుడు అలాంటివాడే గదా!

లంకలోని ఐశ్వర్యమూ, సమస్త సౌకర్యాలూ నేటి అగ్రరాజ్యాలను తలపిస్తుంటాయి. సుందరకాండలోని లంకానగర వర్ణనలో 'సప్తభౌమశ్చాష్టభౌమశ్చ' అన్నారు. ఏడంతస్తుల- ఎనిమిదంతస్తుల భవనాలు ఉన్నాయట! బహిర్ద్వారాలు - అంటే నేటి 'కాంపౌండ్‌వాల్ గేట్' లాగా నన్నమాట. ఇంకా రాక్షసుల (ఇంటి యజమాని) పేర్లను తెలియజేస్తూ నేమ్ ప్లేట్స్ కూడా ఉండేవిట! ఆ ఆధారాలతోనే ఆంజనేయ స్వామి ఆ రాక్షసుల గృహాలను దర్శించి, తరువాత కాలంలో దగ్ధం చేశాడట!

అయితే దానం చేయబడని సంపద - అన్యాయార్జితమైతే దొంగలు దోచుకోవటమే లేక ప్రభుత్వ పరం కావటమో లేదా చివరగా అగ్నిచే దగ్ధం కావించబడటమో తప్పక జరుగుతుందని శాస్త్రవాక్యం. ఆ ప్రకారంగానే లంకలోని సమస్త ఐశ్వర్యమూ, బలమూ, బలగమూ కూడ రామదూత ఆంజనేయుడిచేత దగ్ధం కావింపబడింది కదా!

పై మూడు విధాలైన సమాజాలలో మానవ సమాజం మధ్యగా ఉంది. అంటే మన వ్యక్తిగత, ఆంతరంగిక భావనలు సంస్కారయుతమైన సమాజానికి క్షేమం కలిగించేవిధంగా ఉన్నతమై ఉంటే దైవత్వానికి దారితీసి, శ్రీబాబు చెప్పినట్లు మా 'న'వుడులోని 'న'కారం వెనుక నుండి తలకట్టులోకి కలిసి 'ధ'కారంగా మారి మానవుడు మాధవుడౌతాడు.

సంస్కారం మేడిపండు లాంటిదైనప్పుడు సాటి మనిషి సౌఖ్యానికి సాయపడని దుర్బలులై, సంకుచిత, కపట వర్తనులమైనప్పుడు రాక్షసత్వానికి వారసులమౌతాము. దైవత్వాన్ని అందుకున్నా, దానవత్వానికి దిగజారినా దానికి సంస్కార బలమే కారణం.

ఎప్పుడైనా - ఏ ఒక్కడైనా 'స్వామీ! నీ వాడిని! శరణుకోరుతున్నాను రక్షించు' అని హృదయపూర్వకంగా కోరితే తప్పక రక్షిస్తాను. అది నా వ్రతం అన్నాడు సమస్త జీవకోటికి భద్రప్రదుడైన రామభద్రుడు. మూర్తీభవించిన ధర్మమే శ్రీరామచంద్రుడు. ***రామో విగ్రహవాన్ ధర్మః సాధుస్సత్య పరాక్రమః*** సత్యపరాక్రమవంతుడూ- మూర్తీభవించిన ధర్మమూర్తి శ్రీరామచంద్రమూర్తి.

అట్టి శ్రీగురురాముడు మానవసమాజానికి శాంతినీ శ్రేయస్సును ప్రసాదించు గాక!!

# గురు కృపాహి కేవలమ్

సేకరణ-రమణ ప్రసాద్

అది 1985 వ సంవత్సరం, మే నెల. నేను హైదరాబాద్‌లో పనిచేస్తున్న రోజులవి. ఒకనాడు సుబ్బారావు (వడాలిమామ్మగారి కుమారుడు. బి హెచ్.ఇ.ఎల్ లో పని చేస్తున్నాడు మా ఆఫీసుకి వచ్చి "బాబుగారు వచ్చారుట నీకు తెలుసా?" అని అడిగాడు. నేను "నాకు తెలియదు. ఎక్కడ ఉన్నారు?" అని అడిగాను. "శ్రీనారాయణరావు గారి ఇంట్లో ఉన్నారు" అని చెప్పాడు. మేము అక్కడికి వెళ్ళాము. శ్రీ బాబు నన్ను, సుబ్బారావుని పిలిచి కాస్సేపు మాట్లాడారు. ఆతరువాత బయటకు వచ్చాము. ఆ సాయంత్రం శ్రీ నారాయణరావుగారు ఒక ఎనౌన్స్‌మెంట్ చేశారు " ఒక కంపార్ట్‌మెంటు బుక్ చేస్తున్నాం. శ్రీబాబు పండరీపురం, దేహు, అలంది వెడుతున్నారు. వారు ముందు వెళ్తారు. మనం ముందుగా పూనే వెళ్తాం. అక్కడ మనలను బాబు కలుస్తారు.ఎవరెవరు రావాలనుకొంటున్నారో వాళ్ల పేర్లు ఇస్తే నేను కావలిసిన ఏర్పాట్లు చేస్తాలు. రాత్రికి ట్రైన్ బయల్దేరుతుంది" అన్నారు. అది నేను శ్రీబాబుతో చేసిన మొదటియాత్ర (అదే ఆఖరిది కూడా)

మేము దేహు, అలంది చూసుకొని షోలాపూరు వచ్చాము. అక్కడ రైల్వే రిటైర్‌మెంట్ రూములలో మాకు బస ఏర్పరిచారు. ఆ రాత్రి శ్రీ బాబు అక్కడికి వచ్చారు. బాబు వెంట మాతాజీవారు ఉన్నారు. శ్రీ మనోజ్‌కుమార్ మాతో కూడా అన్ని ప్రదేశాలూ చూపించటానికి వచ్చి ఉన్నాడు. శ్రీబాబు మాతాజీని ఒక పాట పాడమన్నారు. " ఏ గర్వ్‌భరా మస్తక్ మేరా " అనే హిందీ కీర్తన పాడారు. ఆ కీర్తన బాబుకు ఎంతో ఇష్టం. శ్రీమనోజ్‌కుమార్ ఆ కీర్తనలోని మూడవ చరణం పాడారు.

జైసా భీ హూఁ ఖోటా య ఖరా నిర్దోష్ శరన్ మే ఆహిగయా(హా ఆతౌగయా)
ఎక్‌బార్ తౌ కహదే ఖాలీ జా, యా ప్రీత్‌కి రీత్ ఝులక్ నే దే ॥

" ప్రభూ! నేను అజ్ఞానంతో అంధుడనై నీ పాదాలను ఆశ్రయించలేకపోయాను. అహంకార వికారాలతో నిండిపోయిన నా మనస్సును నిర్మలంగాచేసి నీ నిజనామాన్ని జపించేటట్లు చెయ్యి. నేను శాస్త్రాలు చదివి చదివి చదివి కర్మ విహీనుడనై అజ్ఞానమనేనిద్ర లోకిపోయాను. మెలకువ వచ్చాక

పశ్చాత్తాపంతో నా మనస్సు రోదించింది. ఈ అజ్ఞానమనే నిద్రనుండి నన్ను మేల్కొల్పు ప్రభూ! సరే !నేనెటువంటివాడినైనా నీ పాదాల వద్దకు చేరాను.నిన్ను శరణు జొచ్చాను.మరి కరుణిస్తావో? నిరాకరిస్తావో? కరుణించే పక్షంలో నాపై నీ ప్రేమ వర్షాన్ని కురిపించు ప్రభూ''అని ఆ కీర్తనలోని భావం.

ఆ తరువాత శ్రీబాబు కొంత సేపు బోధ చేశారు.

ఆ మర్నాడు మేమంతా పండరీపురం వెళ్ళాం. శ్రీబాబు అప్పటికే వచ్చి ఆలయంలో కూర్చుని ఉన్నారు. మేము వారి ఎదురుగా కూర్చున్నాము. కొంతసేపు తరువాత నిశ్శబ్దాన్ని చీలుస్తూ "పాండురంగడు ఎక్కడ లేడు?'' అన్నారు. నేను ఆలోచనలో పడ్డాను.

ఆ తరువాత పాండురంగని దర్శనం అయింది. పాండురంగడి పాదాలకు తల ఆనించి నమస్కరించాను. పాండురంగస్వామి వైభవం, ముగ్ధ మోహన రూపం నన్ను ఆకట్టుకున్నాయి.

"పాండురంగడు ఎక్కడ లేడు?'' అన్నారు శ్రీ బాబు. మనమంతా దైవంగా భావిస్తున్న బాబే మన పాండురంగడు అని తోచింది....

కొన్నాళ్ళ తరువాత మాతాజీ వారు శ్రీ బాబు వాడిన వస్తువులు, ఇంతకుముందు చూడని బాబు ఫోటోలు పెట్టి ఒక ప్రదర్శనశాల ఏర్పాటు చేశారు. ఆ ప్రదర్సనశాల చూస్తున్న నన్ను ఈ క్రింది ఫోటో ఆకట్టుకుంది.

నేను రాజాని అడిగాను. " రాజా! నాకు ఆ ఫోటో కాపీ కావాలి'' అని. రాజా సరే అన్నట్లుగా తల ఊపాడు.



అది శ్రీబాబు పాండురంగడి భక్తురాలైన ఆదెమ్మగారి కోరికపై శ్రీ బాబు ఇచ్చిన దివ్య దర్శనం. "యద్దృశ్యంతన్నశ్యం'' అంటారే. మరి ఇదేమిటి? శ్రీ బాబు ఇచ్చిన దివ్య దర్శనం కెమేరాలో ఈ విధంగా బంధింపబడటం ఎంత చిత్రం? అంతే కాదు భగవంతుడున్నాడా లేడా? అని సందేహం వచ్చేవారికి ఇది ఒక నిదర్శనం. శ్రీ బాబు అవతార పురుషులు. మానవాళిని ఉద్ధరించటానికి వచ్చిన అవతారమూర్తులు అన్న గుర్తింపు వస్తుంది.

ఈ ఉదంతం ఐదు దశాబ్దాల క్రిందటిది ......
ఒకసారి మాజేటి పున్నయ్యగారి కుటుంబం వారు శ్రీబాబుతో పండరీపురంవెళ్ళి వచ్చాక వారింట్లో శ్రీసద్గురు పాదపూజ చేసుకున్నారు. పూజ పూర్తి కాగానే భక్తులు గులాబీలతో,జాజులతో కూర్చిన పూలగుత్తిని స్వామి చేతికి ఇచ్చారు. స్వామి దానిని భక్తులకు చూపిస్తూ " చూశారా! నిజమైన భక్తుని హృదయం ఎప్పుడూ ఇలా వికసించి, మధురమైన భక్తి భావాలనే సువాసనలను వెదజల్లుతూ ఉంటుంది. అటువంటి భక్త హృదయంలో ఆ భక్త మనోహరుడు ఎప్పుడూ నివసిస్తూ ఉంటాడు. భక్త పుండరీకుడి హృదయంలో పాండురంగడు అలాగే నివసించాడు.'' అన్నారు.

"బాబూ! మీరు పాండురంగడిలా దర్శనమివ్వండి . చూడాలని ఉంది'' అన్నారు శ్రీపున్నయ్యగారి భార్య ఆదెమ్మగారు. వారింటి అలవేల్పు శ్రీపాండురంగడు.

శ్రీ బాబు "ఏం అమ్మా! నాలో ఉన్న పాండురంగణ్ణి అలా ఫొటోలో అయినా దర్శించుకుందామనా? అలాగేలే. ఆ సమయంలో వారబ్బాయి శ్రీబాబుకి ఫోటోలు తీస్తున్నాడు.శ్రీబాబు " ఏమయ్యా! కెమేరా మానూ! ఇప్పటికే చాలా ఫొటోలు తీశావు. నీ రీలులో ఇంకా ఖాళీ ఉన్నదా?'' అని అడిగారు. అతను చూసి "ఒక్క ఫిలిమ్ మిగిలి ఉందండీ'' అన్నాడు. "అంతేనయ్యా! చివరికి మిగిలేది ఎప్పుడూ ఒక్కటే. అదే వాడు. ఆ పాండు రంగడు ఒక్కడే మనకు చివరికి మిగిలే దిక్కు. సరే! ఫొటో తీసుకో'' అని శ్రీ బాబు నిలబడ్డారు. అతను "ఆ పూల గుత్తిని పట్టుకోండి'' అన్నాడు. శ్రీబాబు "భక్తులను ఎలా రక్షించాలా అని తపనపడే ఆ కరుణాంతరంగుడికి చేతిలో పూలగుత్తి పట్టుకుని నిలబడే అవకాశం ఎక్కడ ఉందయ్యా? ఏ భక్తుడు పిలుస్తాడో అని అతని రక్షణ కోసం ఎటెంక్షన్‌లో నిలబడి చేతులు నడుంకు కట్టుకుని నిలబడటమే గదా ఆయన పని'' అని అలా చేతులు పెట్టుకుని నిలబడ్డారు.

కెమేరా క్లిక్‌మంది. అందరి గుండెలు ఝల్లుమన్నాయి. మరునాడు ఫొటోలు అన్నీ వచ్చాయి. అందులో పాండురంగడి ఫొటోలో శ్రీ బాబు తేరిచూడరాని తేజోమయ మూర్తిగా, **జ్యోతిర్జ్వలతి బ్రహ్మోహమస్మి** అన్నట్లుగా తమ నిజదర్శనం అనుగ్రహించారు.

# శ్రీకృష్ణ కర్ణామృతం

(గతసంచిక తరువాయి)

-సుశీలా ప్రసాద

***కల క్వణిత కంకణం కరనిరుద్ధ పీతాంబరం***
***క్రమ ప్రసృత కుంతలం కలిత బర్హ భూషం విభోః***
***పునః ప్రసృతి చాపలం ప్రణయినీ భుజాయన్త్రితం***
***మమ స్ఫురతు మానసే మదన కేళీ శయ్యోత్థితమ్ ॥***

"తల దువ్వుకుని బొట్టుపెట్టుకుని మంచి కోక కట్టుకుని అందరూ వచ్చేసరికి సిద్ధంగా ఉండమ్మా! అని చెబితే నా మాట విన్నావా? అదిగో! అందరూ రానే వచ్చారు. రండమ్మా." విరజ, అత్తగారి మాటలకు తలతిప్పి చూసింది. చక్కగా అలకంరించుకున్న గోపెమ్మలంతా కనిపించారు.

"ఇదిగో మా యింటాయన కాలం చేశాక నలుగుర్లోకి రావటానికి మొహం చెల్లటంలేదింకాను. అందుకే ఆ సీమంతం వేడుకకకి మీతో దాన్ని పంపిద్దామని." ఆవిడ మాటలు వింటూ "పోన్లే అత్తా! ఇదేమన్నా బరువులెత్తటమా! మాతో తీసికెడతాములే. రావమ్మా విరజా! ఏమి చేసుకోకపోయినా నీ చక్కదనానికేమీ తక్కువవదులే" అంటూ విరజను వెంటబెట్టుకుని ముందుకు నడిచారు వారందరూ.

సందడిగా ఉంటే సంగతేమిటో గ్రహించాలని  పక్కింటి ఇల్లాలు వచ్చింది. ఆమెతో విరజ అత్తగారు "చూడమ్మా! నా కోడలు వరస. ఏమీ పట్టించుకోదు. పాలుపొంగి పొయ్యిలో పడుతున్నా అలాగే చూస్తూ కూర్చుంటుంది. పిల్లివచ్చి పెరుగు బానలో మూతి పెడితే దాన్ని తరమాలని కూడా తోచదు. ఒకసారి దూడ విప్పుకొని తల్లిదగ్గర పాలు తాగేస్తుంటే ఏమి పట్టనట్లు అసలా వంకకే వెళ్ళదు. దీనితో ఎలాగ వేగాలో అర్థం కావటం లేదు. ఇలాంటి దాన్ని కట్టుకున్నావేమిట్రా అని నా కొడుకు నడిగితే నా తలరాత అంటాడు వాడు." ఆవిడని ఎలా ఓదార్చాలో తెలియక ప్రక్కింటావిడ అలాగే వింటూ ఉండిపోయింది.

"విరజ అత్తగారి మాటలు వింటుంటే ఆమె మందకొడితనానికి ఏదో కారణం లేకపోలేదనిపిస్తోంది.మరి దానికి కారణం తెలిసి, కావలసిన వైద్యం

చేస్తే బాగుపడుతుందేమో కదా'' యమున నుంచి నీళ్ళు తెచ్చుకుంటూ ఇద్దరు గోపికలు మాట్లాడుకుంటున్నారు. మొదటి మాటలకి రెండో గోపిక "ఔను. దానికి దగిన వైద్యం చేసే ఘనవైద్యుడు కావాలి.'' అంటుంటే, "సరేలే! ఇంకెవరు? మనకి తెలిసినదొకరే ఒకరు. మన ప్రయత్నం మనం చేద్దామా?'' అంది మొదటి గోపిక. అంతలో ఇద్దరు ముగ్గురు వారికెదురైనారు. అంతా కలిసి కూడబలుక్కుని ' సరే' ననుకున్నారు.

చీకటిపడింది. తూర్పున వెండి పళ్ళెంలాగ ఉన్న చంద్రుడు అప్పుడప్పుడే ఆకాశంలో పైకి వస్తున్నాడు. విరజ ఇంటిముందు ఆగి "మనం అనుకున్న దానికి యీరోజు మంచిదే. ఎందుకంటే విరజ పెనిమిటి మధురకు వెళ్ళాడట. రాత్రికి రాడట వాళ్ళత్త చెప్పింది. ఆవిడేమో పొద్దుగూకేసరికి నోట్లో ముద్ద వేసుకుని మంచం ఎక్కుతుంది. తెల్లారిందాకా మరిలేవదు. వాళ్ళకి మాకు గోడే అడ్డం కనుక నాకు తెలుసు'' అని మెల్లగా మాట్లాడుతూ ఒకావిడ అంటే, "ఊరు మాటు మణగనీ'' అంది ఇంకొకామె.

ఆరుబైట వెన్నెలలో మల్లెపందిర పక్కగా ఉన్న మంచం మధ్యలో కూర్చుని ఉంది విరజ. ఏమాలోచిస్తున్నదో ఎవరికీ తెలియదు. చుట్టుప్రక్కలంతా నిశ్శబ్దంగా ఉంది. ఒకరిద్దరు గోపికలు ఆమె దగ్గిరకి వచ్చి నిలబడ్డారు. నెమ్మదిగా "మాతోరా!'' అని చెయ్యిపట్టుకుని లేపించారు. విరజ ఏమిటని కూడా అడగకుండా వారితో నడిచింది.

వాళ్ళకి దోవ తెలుసు. ఎక్కడికి వెళ్ళాలో తెలుసు. వెళ్ళి వెళ్ళి వాళ్ళంతా ఒక చోట ఆగారు. ఇంకా కొంతమంది వారితో వచ్చి కలిశారు. చుట్టూ అల్లుకున్న పొదరిళ్ళు పూలవాసనలు విరజిమ్ముతున్నాయి. ఎదురుగా పారిజాతం చెట్టు. తన దగ్గిరకి వచ్చిన వాళ్ళని గాలికి రాలే పూలతో పలకరిస్తోంది. ఆ గాలీ వెలుతురూ వాతావరణమూ అంతా అక్కడ అడుగుపెట్టిన విరజలో గొప్ప మార్పులు తెస్తున్నాయి. చుట్టూ కలయచూసిన విరజ తనకెదురైన పాదద్వయం మీద ఆమె చూపు నిలిచింది. ఏదో తెలియని ఆనందాన్నిస్తూ మైమరపిస్తున్న ఆ దివ్యచరణాలు తనకి సుపరిచితాలే! చప్పున వెళ్ళి వాటిని చేతులతో చుట్టేసింది.

-సశేషం

## పరిప్రశ్నేన సేవయా

-పరాశర ప్రసాద్

నేను మీతోనే సంచరిస్తున్నాను. మీరే నా దైవము. ఇంక నాకు వేరే దైవముతో పనిఏమున్నది? అయినా నేను సాధన చేయాలా? ఎందుకు? అని సందేహము వెలిబుచ్చిన భక్తునికి సమాధానంగా శ్రీసద్గురుదేవులు బోధ చేస్తూ " నాగురుదేవులే సర్వస్వం, సర్వరక్షకుడు, సర్వశక్తిమంతుడు, సర్వేశ్వరుడు, సర్వాంతర్యామి అని పరిపూర్ణ విశ్వాసంతో సద్గురుమూర్తిని ఆశ్రయించిన సాధకుడు నిరహంకారియై, నిరాడంబరియై, నిత్యసంతోషియై వ్యవహరిస్తాడు.

అతనిలో ఆశగాని, అసంతృప్తిగాని, సందేహాలుగాని ఉండవు కదా! వినయ విధేయతలు, త్యాగము, విశాల దృక్పథము ఉంటాయి. సంసారమనే ఎండమావుల సాగరాన్ని దాటటానికి సద్గురుమూర్తి అందించిన సాధన అనే నావ ఎక్కి సాగరంలో పూర్తిగా మునిగిన వాడికి సాగరమూ లేదు, సాధనా లేదు. మరి మీరు ఆ స్థితిలోనే ఉన్నారా?

పరిపూర్ణ విశ్వాసంతో సమర్ధుడైన సద్గురుమూర్తిని ఆశ్రయించిన వారిలో దోషాలను ఎన్నడూ చూడడే. ఆయనకి సంపూర్ణ శరణాగతి పొందిన తరువాత తాను ఏమీ చేస్తున్నాను అనే ప్రశ్న ఉదయించదే. ఏమి చేసినా దానిని ఎలా సరిదిద్దాలో అది ఆయనకే చెల్లు. భగవంతుని ఆశ్రయిస్తే చాలు. ఆయన చేరదీయక ఊరుకుంటాడా! ఇంతకాలానికి నాకీ జీవుడు లభించాడు అని సంతృప్తి చెందుతాడు. అంతవరకు ఎన్ని తప్పులు చేసినా 'దాసుని తప్పులు దండముతో సరి' అన్నట్లుగా సరిపెట్టుకుంటాడు.

అంతెందుకు నీ వేలుకి ఉన్న డైమండ్ ఉంగరము జారి బురదలో పడిపోయింది. ఏం చేస్తావు? బురద అంటిందని అక్కడే వదలివేస్తావా? ఆ బురదని కడిగి తీసుకుంటావు. సద్గురుమూర్తి వాత్సల్యం అలా ఉంటుంది. 'నా గురుదేవుడు సర్వరక్షకుడు' అని భావించిన వాడికి మృత్యు భయం ఎందుకు? ప్రతివాడు భీతి చెందేది మృత్యువు అంటేనే కదా! ఏ సంఘటన జరిగినా భయమే. జాగ్రత్తగా ఆలోచించుకుంటే భయానికి కారణం తాను చనిపోతాననే మరణ భయమే. 'నేను' అనే భావనే మృత్యుభయానికి కారణం. 'నేను' అనే దేహభావనే మృత్యు భయాన్ని కలుగజేస్తుంది. సాధకుడు అంతరాంతరాలలోనికి వెళ్ళి అసలు 'నేను'ను గుర్తిస్తే 'నేను' సర్వవ్యాపకమైనది. ఈ దేహానికి పరిమితమైనది కాదు. ఈ దేహం అశాశ్వతమైనది. ఎప్పటికైనా రాలిపోయేదని గుర్తించిన వాడికి మరణ భయం ఉండదు. సందేహాలు కలుగవు. **NO QUESTON NO ANSWER, UNDERSTAND?** అన్నారు శ్రీగురుదేవులు.

(గతసంచిక తరువాయి)

# శివానందలహరి

-బులుసు మల్లిక్ U.S.A

జ్ఞానానికి విద్యమూలము. విద్యకి గురువు మూలము. గురువుకి కళ మాధ్యము. దానిని ప్రసాదించేదే ఆ ఆది దంపతులు. వారే ఆదిమ గురువులు. వారు ఎలా ఉన్నారంటే - **'చూడాలంకృత శశికళాభ్యాం'**. చంద్రుడు సోమకిరణుడు. సోమమంటే ఉమా సహితమైన అమృతత్వం. అంటే ఆ అమృతత్త్వాన్ని పంచిపెట్టేందుకు సంకేతంగా చంద్రరేఖను తలమానికంగా ధరించారు వారిద్దరూ. వారివైపుకు మన మనస్సును మళించాలేకాని అనుగ్రహమీయడానికి ఆ అర్థనారీశ్వరులు ఎల్లవేళలా సంసిద్ధులై యున్నారు. వారెట్టివారంటే **'నిజ తపః ఫలాభ్యాం'**. ఒకరి తపస్సుకు ఒకరు ఫలమై ఉన్నారు. అదే విచిత్రం. ఎందుచేతనంటే ఉన్నది కేవలం ఒక్కటే. ఇది కొంచెం ఆలోచిస్తే తెలుస్తుంది. ఎలా అంటే, నేనే నాకు రెండు రూపాయలు అప్పిచ్చుకున్నాను అన్నట్లు విడ్డూరం. తత్త్వం అర్థమైనవారికి ఆ సమస్య మటుమాయం అవుతుంది. అది అసలు ఒకటా లేక రేండా అనే మాటే రాదు.

'దశశ్లోకీ'లో శంకరులు ఆత్మతత్త్వాన్ని ఉద్దేశిస్తూ 'న చైకంతదన్యద్ ద్వితీయం కుతస్స్యాత్' . అది ఫలానా 'ఒకటనే' నిర్ధారించలేకపోతున్నామే, మరి ద్వైతానికి చోటేది? అంటూ అద్వైతాన్ని ప్రతిపాదిస్తారు ఆదిశంకరాచార్యులవారు. ఇంకా 'భక్తేషు ప్రకటిత ఫలాభ్యాం' అంటున్నారు. అంతేగాక చరాచర జగత్తుకంతటికీ తల్లితండ్రులైనవారు లోక సంరక్షణ, పాలన, పోషణ చేస్తున్నారు కదా! అడిగనదే తడువుగా మనకేం కావాలో మనకు అందిస్తున్నారు.

ఆలోచించండి! అప్పుడే పుట్టిన బిడ్డ వ్యాకరణం నేర్చుకున్నాడా? సంగీతం నేర్చుకున్నాడా? వాడికేం కావాలో అడగటం చేతకాదు. చిన్ని కళ్ళతో తీక్షణంగా తన తల్లికేసి చూస్తూ తన పొట్ట నింపుకుంటున్నాడే. అంటే ఎవరిని ఆశ్రయించాలో తెలియాలిగాని, ఆశ్రయించాక దేహి అని అడగవలసిన అవసరమేముంటుంది? ఆశ్రయమే ప్రకటన. ఆశ్రయించినవారికి కొరతలేని మంగళము తథ్యము. ఎలాగంటే **'అస్తోక త్రిభువన శివాభ్యాం'** - ముల్లోకాల్లో ఎక్కడైనా, ఎప్పుడైనా, మంగళప్రదమని మీకు అనిపిస్తే అది శివాశివుల

సాక్షాత్కార సందృశ్యమని, అనుగ్రహమని నిశ్శంశయంగా మనం గ్రహించాలి.

**'హృదిపునర్భవాభ్యాం'** - ఆ అమృతత్త్వానికి బద్ధుడుకాని వాడంటూ ఉంటచాడా? ఆ రుచి మరగినవాడు మదిలో ఆ ఆనందాన్నే నెమరువేసుకుంటూ, పునః పునః అదే అనుభూతి కావాలని కాంక్షిస్తాడు. ఎందుచేతనంటే **'ఆనందస్ఫురదనుభవాభ్యాం'** - అంటే ఏది స్వచ్ఛందమైనది, అవ్యాజమైనది అయిన ఆనందమయి ఉన్నదో దానిని మనకు సాక్షాత్కారింపజేయు స్వరూపాన్ని పొందియున్నట్టివారు కావడం చేత వారే 'శివాభ్యాం' అని కొనియాడ బడుతున్నారు యిక్కడ. అదే శివాశివులు. వారికి **'మే నతిరియం'** - నా నమ స్సుమాంజలులు.

ఓం శాంతిః శాంతిః శాంతిః

## కుహనా గురువు

ఒక కాళ్ళజెట్టికి ఆర్థ్రైటిస్ (కీళ్ళవాతం) సమస్య వచ్చింది. రెండు కాళ్ళు ఉండే మనుష్యుడే ఆర్థ్రైటిస్ వస్తే ఎంత అవస్థ పడతాడో మనందరికి తెలిసిందే. అటువంటిది వంద కాళ్ళు ఉండే జెట్టికి వచ్చిందంటే యిక అది ఎంత బాధాకరమో ఊహించుకోండి!

ఆ జెట్టి విచారించగా ఒక గుడ్లగూబ ఘనవైద్యుడు అని తెలిసింది. అది ఆ ఆర్థ్రైటిస్‌తో నానా అవస్థలు పడి చెట్టు పైకి ప్రాకి గుడ్లగూబ దగ్గరకు వెళ్ళి తన సమస్యను చెప్పుకుంది.

గుడ్లగూబ గుడ్లు పెద్దవిచేసి, ఫీజు వెంటనే తీసేసుకుని నీ సమస్యకు ఒక పరిష్కారం ఉంది, మరేం లేదు నీ కాళ్ళలో కదా! ఆర్థ్రైటిస్ ఉంటా. నీవు నడవకుండా ఎగరటం నేర్చుకుంటే సరి. నీకు ఏ సమస్యా ఉండదని ఎగిరిపోయింది. జెట్టికి తను ఎగరటం ఎట్లాగో తెలియలేదు.

కుహనా గురువుల దగ్గరకు వెళ్ళి అటువంటి ఉపదేశాలు పొంది సాధన ఎలా చేయాలో తెలియక ఎందరో నానా అవస్థలు పడతారు.

# తీర్థ యాత్రా ఫలితం

- సుశీలా ప్రసాద

తీర్థయాత్రలకని ఇద్దరు మిత్రులు బయలుదేరారు. పూర్వపు రోజులు గనుక కాలి నడకన పయనం సాగిస్తున్నారు. కొంత దూరం వెళ్ళాక మార్గాయాసం చేత ఒక ఊరిలో ఆగారు. ఒక యింటి దగ్గర నిలచి, "ఇంట్లో వారెవరన్నా కాస్త మంచినీళ్ళిస్తారా దయచేసి దాహంగా ఉంది. దారినపోయే బాటసారులం" అన్నారు. వారి పిలుపుకి ఎవరూ బదులు పలకలేదు. మరోసారి పిలిచి చూశారు. కనీసం ఎవరూ బయటకి కూడా రాలేదు. తలుపులు చేరవేసే ఉన్నందున కొంచెం సాహసించి ఇద్దరూ లోపలికి వెళ్ళి చూశారు. లోపల మంచాల మీద, నేల మీద ఉన్న ఆడ మగ వృద్ధులు చాల మంది వారికి కనిపించారు. వారంతా కళ్ళు తెరచి చూస్తున్నా పలకలేని, కదలలేని స్థితిలో ఉన్నారని అర్థమైంది. మిత్రులిద్దరూ ముఖముఖాలు చూసుకున్నారు. అనారోగ్యంతో బాధపడుతున్న వారి సంగతి ఏం చెయ్యాలో తోచలేదు వారికి.

'ఎలాగైతే నాకేమి నా సంగతి నేను చూసుకోవాలి' అనే తత్త్వంగల సోమయ్య మిత్రునితో "మనం ఏం చెయ్యగలంగాని, మనం వచ్చినదారినే పోదాం పద" అన్నాడు. 'కష్టాలలో ఉన్నవారికి తోడ్పడాలనే తత్త్వం'గల రామయ్య "అలాకాదు సోమూ! నువ్వు నడుస్తూ ఉండు. నేను వీరికి కొంచెం సాయం చేసి సులువుగా ఉన్నాక నేనూ వచ్చి నీతో కలుస్తాను" అన్నాడు. "ఆ భారమంతా నీకెందుకురా నెత్తిన వేసుకుంటావ"ని మందలించి వచ్చేయమన్నా, రామయ్య అందుకు అంగీకరించక అక్కడే నిలచిపోయాడు.

రామయ్య తన శక్తికి మించిన శ్రమతో ఇంట్లో వారందరికీ సేవలు చేయవలసి వచ్చింది. అయినా ఎంతో ఓర్పుతో పరిస్థితులకి తట్టుకుని నిలబడి అందరికీ తన సాయం అందించాడు. అలాగ రోజులు గడిచాయి. అంతా కోలుకున్నారు. తమ తమ పనులు తాము చూసుకోగల బలం వారికి వచ్చింది. రామయ్యను తమలో ఒకడిగా వారంతా ప్రేమాభిమానాలతో చూడసాగరు. రామయ్య ఒకనాడు "ఇక నేను వెళ్ళి వస్తాను" అంటే ఆత్మ బంధువు దూరమైపోతుంటే బాధపడుతున్నట్లు వారందరూ కళ్ళనీళ్ళు పెట్టుకున్నారు. చేతులు జోడించి తమ కృతజ్ఞతలు తెలుపుకున్నారు. వారందరి విలువైన ఆప్యాతను నిండుగా సంపాదించుకుని రామయ్య ప్రయాణమయ్యాడు.

అయితే తమ యాత్రా కాలాన్ని నిర్ణయించుకున్న ప్రకారం అందులో చాలా భాగం ముగిసిపోవచ్చేసరికి, రామయ్య యింటికి తిరిగి వెళ్ళిపోవాలని నిశ్చయించుకుని యిల్లు చేరాడు. ఇంట్లో కాలుపెట్టిన రామయ్యకు యింట్లో విశేషాలన్నీ తెలిసి పరమానందమైంది. ఇల్లంతా కళకళలాడుతున్నది. ఇంటికి సమృద్ధిగా పండిన పంట చేరింది. ఆడపిల్లకు పెళ్ళి సంబంధం కుదిరి వియ్యాలవారు వివాహ ముహూర్తం నిశ్చయించుకుని వెళ్ళారు. కోడలు సుఖప్రసవమై పండంటి బిడ్డను కన్నది. అంతా సంతోషమే!

రామయ్య కాలుకదిపి తాను నమ్మి, పూజించే యిష్టదైవాన్ని దర్శించుకోవటానికి ఆలయానికి వెళ్ళాడు. బ్రహ్మానందంతో చేతులు జోడించి నమస్కరిస్తూ "నాకు యాత్రలు చేసిన ఫలితాన్ని దక్కించావు. నమ్మినవారికి సొమ్మైన బంగారు పిచ్చుకవు నువ్వు!" అన్నాడు.

ఎక్కడ మాటలలో కరుణ మెరుస్తుంటుందో, ఎక్కడ చూపులలో ప్రేమ చిందుతుంటుందో, అక్కడే నీకు మంచితనం దొరుకుతుంది.

* * * * * *

మనస్సు మసి లేకుండా నిలుపుకుంటే అదే ధర్మం. మిగిలినది అంతా ఆడంబరమే.

* * * * * *

నీ శరీరము తల్లి యొక్క వ్యక్తరూపమని, నీ చేష్టలు ఆమె చేష్టలని భావించడమే మాతృ పూజ.

* * * * * *

పరిపూర్ణ వికాసముతో తన దళములను, మరి పరిమళమును తన జన్మకి కారణమగు తోటమాలికి సంపూర్తిగా సమర్పించుకొను కుసుమము వలె ఉండనీ నీ జీవితమును.

నిన్ను నీవే భగవంతుని కరకములందు సమర్పించుకొనుము. అప్పుడు నీ బ్రతుకెంత శోభతో ప్రకాశించునో కనుగొనుము.

* * * * * *

**- రామదాస**

# నాడు - నేడు

(గత సంచిక తరువాయి) - స్వామి విజయేశ్వరానంద ప్రసాద్

ఆనాటి గురుకులాలలో నిరుపేదల నుండి రాజకుమారుల వరకు అన్ని వర్గాలవారు ఉండేవారు. గురుదేవుని సమక్షంలో, గురుకుల వాతావరణంలో అందరూ సమానులే. గురుకుల ప్రాంగణాన్ని శుభ్రపరచటం మొదలుకొని వేదాధ్యయనం వరకు అన్నీ వారి విధులే. వారికి హక్కులు అంటూ ఉండేవికావు. తమకు హక్కులు లేకపోయినవే అని వాళ్ళు ఎన్నడూ అనుకోలేదు. గురుదేవుడు కురిపించే ప్రేమామృత సృష్టి వాళ్ళకు వజ్రకవచమై జీవితాంతం కాపాడేది.

ఆనాటి వ్యవస్థ ఈనాటి సమాజానికి నిరుపయోగమని కొందరు అనవచ్చును. ఆనాటి ఉత్తమ ఉన్నత ఆదర్శాలను నిలుపుకుంటూనే, ఈ సమాజానికి అది చక్కగా ఉపయోగపడేటట్లు దానిని మనం మలచుకోవచ్చు. అప్పటి విద్యకంటె ఇప్పటి విద్యలో ఎన్నో కొత్త విషయాలు ఉన్నవని మరికొందరు మేధావుల వాదం. ఏ శాస్త్రంలో చూచినప్పటికి ఆఖరుకు నవీనములుగా పరిగణింపబడుతున్న వృక్షశాస్త్రం, జంతుశాస్త్రం, గణిత శాస్త్రం మొదలగు వాటిలో సయితం ఈనాటికంటె ఆనాడే అధిక మేధావంతులుండేవారని మనదేశ చరిత్ర పరిశీలిస్తే తెలుస్తుంది.

ఖగోళగణితంలో మన ప్రాచీనుల ప్రతిభా విశేషాలను నిదర్శనకు పంచాంగాలలో నిర్ణయించిన వేళకు నిముషాలు సెకండ్లు సరిపోయే విధంగా గ్రహణాలు మొదలగునవి సంభవించడం. ఆధునిక విద్యాగంధం లేకనే గణితంలో అఖండ ప్రజ్ఞావంతులుగా పేరుగాంచినవారు మన దేశంలో ఎందరు లేరు? ఉదాహరణకు అక్బర్ కొలువులో విదూషకుడొకడు ఒక కోరిక కోరాడు. మొదటి రోజున ఒక పైసతో ప్రారంభించి, ప్రతిరోజూ రెట్టింపుచేస్తూ మండలం రోజులు మాత్రమే తనకు ధనమిస్తే చాలని కోరాడు. తనవంటి చక్రవర్తిని ఇంత చిన్న కోరిక కోరడమా అని ఆయన కించపడ్డాడు. కాని, మహామేధావి అయిన బీర్బల్ ఆ కొలువులోనే ఉన్నందున సరిపోయింది. విదూషకుడి కోర్కె సామాన్యమైనది కాదని, దానిని తీర్చడానికి ఖజానా డబ్బు చాలదని అక్బర్‌కు

విన్నవించారు. దాని వివరాలు తెలుసుకున్న అక్బర్ ముక్కుమీద వేలు వేసుకున్నాడు.

ఈనాడు మన పాఠశాలలు, కళాశాలలు ఎంత శోభాయమానంగా విరాజిల్లుతున్నాయో అందరికీ తెలిసినదే. ఈ సంతోష సమయంలో ఆ విషయాలన్నీ గుర్తుకుతెచ్చుకోవటం శిరోవేదనను కోరుకోవటమే. 'తిలాపాపం తలాపిడికెడు' అన్నట్లు ఇటువంటి పరిస్థితుల బాధతకు విద్యార్థులు మాత్రమే కాక, ఉపాధ్యాయులు, యాజమాన్యాలు, తల్లిదండ్రులు, ప్రభుత్వం, సమాజం కూడా పాలుపంచుకొనక తప్పదు. స్థితిగతులు వీళ్ళందరికీ తెలిసిఉన్నప్పటికీ నిస్సహాయులై చూస్తూ మిన్నకుండటం వల్ల ఆ దుష్ఫలితాలను అందరూ అనుభవిస్తున్నారు.

కాని వారిలో ఎవ్వరైనా ఈ సమస్య అత్యవసరమైనదిగా భావించి, దాని పరిష్కారానికి పూనుకొన్న పక్షంలో ఇతరులు తప్పక అనుసరిస్తారు. సమస్య పరిష్కారం అవుతుంది. మామూలు విద్యతోపాటు దేశభక్తి విషయాలు, భగవద్భక్తి విషయాలు జోడించినప్పుడే విద్యాలయాలలో వ్యక్తిత్వ నిర్మాణ కార్యక్రమం సర్వతోముఖంగా సత్ఫలితాల నివ్వగలుగుతుంది.

## సంయమీంద్రులతో ఒక సాయంత్రం

ఒక రోజు కంచికామకోటి పీఠాధిపతులు శ్రీ చంద్రశేఖరేంద్రులను ఒక విదేశీయుడు కలిశాడు. వారి మధ్య సంభాషణ యీ విధంగా సాగింది.

విదే - నేను ఒక జ్ఞానినే అనుకుందాం, అప్పుడు మిమ్మల్ని నేను ఏం ప్రశ్న వేయాలి?

స్వామి - (మందహాసంతో) నువ్వు జ్ఞానివైతే ప్రశ్నించవలసిన అవసరమే ఉండదు.

విదే - పోనీ మూఢుడిని అనుకుంటే నా మార్గమేమిటీ?

స్వామి - అప్పుడు నీవు అనుసరించేదే నీ మార్గం.

సేకరణ - జె.సుశీల

# నూతన సంవత్సరం సందర్భంగా
# శ్రీమాతాజీ వారి సందేశము.

ఈ రోజు 2011 సంవత్సరానికి వీడ్కోలు చెప్పి 2012లో ప్రవేశించాం. వాడుక ప్రకారం అందరం ఒకరికిఒకరు "హ్యాపీ న్యూఇయర్" చెప్పుకుంటున్నాం. కాని మనం నిజంగా హ్యాపీగా ఉన్నామా? లేము. ఏవేవో కష్టాలూ,కలతలూ మనలను కలవరపెడుతుంటాయి. పర్యవసానం ఎలా ఉంటుందో ఏమో అని భయపడుతూ ఉంటాం. కాని మనమంతా శ్రీగురుదేవుల సంపూర్ణ అనుగ్రహమనే ముద్రలోనే ఉన్నామని మరువకుండా ఉంటే ఇంక మనకి భయమెక్కడిది?

ఒకసారి జరిగిన సంఘటన. కొంతమంది భక్తులు గోదావరి నదిలో సుడిగుండంలో చిక్కుకున్నారు. ప్రాణాపాయస్థితిలో వారు "బాబూ" అని ఎలుగెత్తి అరిచారు. వెంటనే శ్రీబాబు తను కట్టుకొన్న గ్లాస్కో పంచెను విసిరి " మీరంతా దీనిని పట్టుకొని రండి. ఏమీ పరవాలేదు'' అని అభయం ఇచ్చారు. అందరూ సురక్షితంగా ఒడ్డుకు చేరారు. అది మామూలు వస్త్రం కాదు. అది "దేవతా వస్త్రం.'' శ్రీబాబు వారిని ఇలా ప్రశ్నించారు, "ఒడ్డున మీ తల్లి తండ్రులూ, బంధువులూ ఉన్నారు. కాని ఒక్కరూ ముందుకు రాలేదు ఎందువలన?''అని. ఎవరూ మాట్లాడలేదు. కాని మనందరికీ ఒకటి తెలుసు. మనకి ఏ ఆపద వచ్చినా ఆర్తిగా "బాబూ'' అంటే రక్షణ తప్పక జరుగుతుంది అని. మెట్లమీదనుంచి కాలుజారితే అప్రయత్నంగా "బాబూ''అంటాం. ఏది వచ్చినా బాబు నామమే మన పెదిమలమీద ఉంటుంది. మనకు రక్షణ జరుగుతోంది. అలా ఎప్పుడు జరుగుతోంది? "నా ప్రభువు (బాబు) తప్ప నాకు ఇంకెవరూ లేరు'' అని విశ్వసించినప్పుడు. కానికర్తృత్వ, భోక్తృత్వ భావనలు మనని బంధిస్తున్నందువల్ల మనం కష్టాలపాలౌతున్నాము. "బాబు'' అనే పిలుపు మనకి ఆనందాన్ని ఇస్తోంది. మనలను నిర్భయులుగా చేస్తోంది.

అయితే ఆనందంఎక్కడ ఉంది? అంటే ఎక్కడో లేదు. మనలోనే ఉంది. గురుదేవులు చెచప్పిన విధంగా సాధన చేస్తే, మన మనో బుద్ధిచిత్తాహంకారాలు. సత్యం, శాంతి, దయ, ప్రేమలుగా మారి మనలో ఉన్న "దేహి'' ని గుర్తిస్తాం.

స్వామి మనకు శ్రీ విజయేశ్వరానంద ప్రసాద్ గారి ద్వారా ఒక పాటను అందించారు

BYE BYE 2K11, WELCOME 2K12
HAVE A HAPPY NEW YEAR
HAPPY HAPPY NEW YEAR
"WHY FEAR ?WHEN IAM HERE"
SAID THIS SADGURU BABU DEAR

అలా దివ్యత్వం ప్రకాశిస్తూ ఉండబట్టే ఈ సృష్టి ప్రకాశిస్తోంది. శ్రీకృష్ణుని దివ్యత్త్వం గ్రహించలేని బ్రహ్మ ఆయనను పరీక్షించదలిచి గోపబాలురను, ఆవులను దాచాడు. కృష్ణుడు వారి రూపాలు ధరించాడు. ఇలా ఒక సంవత్సరం గడిచింది. పరబ్రహ్మ అయిన శ్రీకృష్ణుడు అందించిన స్ఫురణతో తన తప్పును తెలిసికొని శరణు వేడాడు. దీనివలన మనం ఏం గ్రహించాలి? అంటే -మనం ఎంత జాగరూకతతో ప్రపంచంలో మెలగాలి? అని.

మనం దేనికీ భయపడాల్సిన పని లేదు. భగవన్నామాన్ని ఆశ్రయించండి. నామానికి నామి వేరు కాడు. ఆ నామమే "బాబు." ఎటన్షన్ ఫుల్‌గా ఉండి టెన్షన్ ఫ్రీ జీవితాన్ని గడపండి. ఆయన లీలా వైభవంలోనే మన జీవితాలు గడుస్తున్నాయని గుర్తించండి.

అట్టి శక్తిని, భక్తిని, సాధనా సంపత్తిని శ్రీగురుదేవులు మనకందరికీ ప్రసాదించుగాక! సుభీభవ! సుభీభవ!!

సద్గురువుపై నిలుపుకున్న అచంచల విశ్వాసమే జీవన్ముక్తికీ, భగవద్దర్శనానికీ రాచబాట.

సంకల్పమే కర్మకు మూలం. సంకల్పనాశనమే మనోలయ స్థితి. మనోలయమే ఆత్మ సాక్షాత్కారానికి దారితీస్తుంది.

కష్టములో ఉన్న తోటి మానవుని కన్నీరు తుడిచి దైన్యాన్ని పోగొట్టుటకు ఎవరు తన సర్వస్వం త్యాగం చేస్తారో అతడే భగవంతుడికి ప్రియుడు.

- శ్రీ కాళీ ప్రసాద బాబు

# సమర్థ సద్గురు నాథుని దివ్య చరిత్ర

(గత సంచిక తరువాయి) - విజయేశ్వరానంద ప్రసాద్

యనమదుర్రు కరణంగారైన చాగంటి లింగమూర్తిగారి కుమారుడు శక్తీశ్వరరావు జగన్మాత భక్తుడు, మంచి సాధకుడు. మొదట్లో ఆయన శ్రీబాబును గూర్చి అంతగా పట్టించుకోలేదు. కాని, ఒక సందర్భంలో ,ఆయనతో శ్రీబాబు యెడల భక్తిగల ఒక మిత్రుడు " శ్రీ బాబు, అమ్మ దర్శనం నిరంతరం చేసుకుంటూ అమ్మతో ప్రత్యక్షంగా మాట్లాడే మహానుభావుడు. నువ్వు నిజంగా జగన్మాత భక్తుడవే అయితే, శ్రీబాబుకు సన్నిహితుడవు కావలిసిందేరా! లేకపోతే నీ జన్మ వ్యర్థం'' అన్నారు. శక్తీశ్వరరావు అప్పటికి చాలా కాలం నుండి విపరీతమైన తలనొప్పితో బాధపడుతున్నాడు. ఎన్నో వైద్యాలు, జపాలు, మంత్రాలు, తంత్రాలు ఈ తలనొప్పిని తగ్గించలేకపోయాయి. శక్తీశ్వరరావు తన మిత్రునితో "ఏదీ! ఆ బాబును నా తలనొప్పిని తగ్గించమను చూద్దాం'' అన్నాడు. "మహామహా జబ్బులే కుదిర్చే ఆ మహనీయునికి ఇది చాలా అల్ప విషయం రా. సరే నీ తల నొప్పి తగ్గితే అప్పుడైనా ఆయన ఔన్నత్యాన్ని ఒప్పుకుంటావా?'' అని ఆ మిత్రుడడిగాడు. ''ఒప్పుకోవటమేమిటి? ఆయనకు శిష్యుడినే అవుతాను''అన్నాడు శక్తీశ్వరరావు.



ఈమాట ఆనోటా ఆనోటా శ్రీబాబు వరకూ వెళ్ళింది. వారు మందహాసం చేస్తూ "ఏ బిడ్డను ఎప్పుడు , ఎలా, తన వద్దకు రప్పించుకోవాలో జగన్మాతకు తెలియదా? అమ్మే చూసుకొంటుంది'' అని ఊరుకున్నారు.

మర్నాటికే శక్తీశ్వరరావు తలనొప్పి తీసేసినట్లు మాయం కావడం, శక్తీశ్వరరావు శ్రీబాబుకు పాదాక్రాంతుడై భక్తుడు కావడం జరిగిపోయాయి. శ్రీబాబు యనమదుర్రులో ఉన్నప్పుడల్లా శక్తీశ్వరరావు ఆయనను వదలి ఉండేవాడు కాదు. జగన్మాత దివ్యతత్త్వం గుర్చి ఎక్కువగా శ్రీబాబుతో మాట్లాడుతూ ఉండేవాడు. " బాబూ! నాకు అమ్మ దర్శనం యిప్పించాలి'' అని పోరు పెట్టేవాడు. బాబు ఒడిలో పడుకుని ఆయనతో చతురోక్తులాడేటంత చనువు ఏర్పడింది. " శక్తీ ! నువ్వు శ్రద్ధాభక్తులతో అమ్మను పూజించుకుంటూ

ధ్యానించుకుంటూ ఉంటే, తగిన సమయానికి అమ్మ తనంతట తానే నీకు దర్శనం తప్పకుండా ఇస్తుంది. విశ్వాసము, సాధనా సడలనీయకు" అని హితవు పలికారు. అతను సాధన బాగానే చేసేవాడు. కాని దర్శనం లభించి తీరాలనే తొందర ఎక్కువైంది.

ఒకసారి అతను శ్రీబాబు ఒడిలో పడుకుని " ఈ రోజు నాకు అమ్మ దర్శనం యిప్పించేవరకూ వదలను" అని పాదాలు పట్టుకున్నాడు. శ్రీబాబు "అయితే, లేచి కూర్చో. నా దేవతార్చనవైపు తిరిగి అమ్మవైపు చూడు" అన్నారు. శక్తీశ్వరరావు ఉత్సాహంగా లేచి కూర్చుని దేవతార్చనలోని జగన్మాతవైపు చూశాడు. ఆ క్షణంలోనే అత్యంతతేజోవంతమైన కాంతి, కోటి సూర్యుల ప్రకాశాన్ని మించిన కాంతి శక్తీశ్వరరావుకు కనిపించింది. ఆ కాంతి క్షణ క్షణానికి యింకా ఎన్నో రెట్లు తేజోవంతమై గది అంతటా వ్యాపించింది. శక్తీశ్వరరావుకు అది భరించరానిదై, అతను తట్టుకోలేక బిగ్గరగా "బాబూ! ఈ తేజస్సును నేను చూడలేకుండా ఉన్నాను. కళ్ళు మూసుకున్నా అదే వెలుగు. భయంగా ఉంది. రక్షించండి బాబూ!" అని కేకలు పెట్టాడు. శ్రీ బాబు ఆ కాంతిని వెంటనే ఉపసంహరించారు.

ఆ దర్శనానికి తట్టుకోలేక అతడు రెండు మూడు రోజులపాటు చాల అస్వస్థతకు గురి అయినాడు. శ్రీబాబు ప్రతిరోజు ఉదయము, సాయంత్రము అమ్మ తీర్థము, ప్రసాదము, అక్షతలు, కుంకుమ యిచ్చేవారు. స్వస్థత కలిగాక, శ్రీబాబు అతనితో "చూడు శక్తీ! అమ్మ పరమ కరుణామయి. తన బిడ్డలకు దర్శనమీయటానికి ఆమె సదా సంసిద్ధంగానే ఉంటుంది. కాని నిరంతరము భక్తి శ్రద్ధలతో సాధన చేయాలి. ఆ సాధన పరిపక్వమయినపుడే, ఆ అఖండ తేజోమూర్తిని దర్శించగల సామర్థ్యము కలుగుతుంది. పరిపక్వం కాని మనస్సు ఆ దర్శనాన్ని తట్టుకోలేదు. అందువలననే యిలాంటి ఒడుదుడుకులు కలుగుతాయి. మృత్యువు కూడ కలుగవచ్చు. ఈ నిజాన్ని తెలుసుకోలేని ప్రజలు అమ్మ నెత్తి అణచింది అనో, భయంకరమైనది అనో విరుచుకు తింటుంది అనో ఆడిపోసుకుంటారు అమ్మను. అమ్మ ఎన్నటికీ తన బిడ్డలకు కీడు చేయదు. భయం కలిగించదు. భయం కలిగేది అమ్మ వలన కాదు, మన మనస్సులో యింకా తొలగిపోకుండా ఉన్న కలుషములవలననే. కలుషమనస్సు, సాధనద్వారా శుద్ధమనస్సుగా మారినప్పుడు, అమ్మ ఆనందస్వరూపిణిగా దర్శనమిచ్చి, ఆనందాన్నే ప్రసాదిస్తుంది" అని వివరించారు.

-సశేషం

# పవిత్ర దేవాలయం

ఒక గ్రామంలో ఒక దేవాలయానికి ధర్మకర్త ఉండేవాడు. ఆయన ఊరివారికి పురాణం చదివి వినిపించేవాడు. ఒకనాడు ఆయన పురాణం చదువుతూ "జ్ఞాని అయినవాడి దృష్టిలో అంతా ఈశ్వరుడే. వీడు బ్రాహ్మణుడనీ, వీడు చండాలుడనీ, పామరుడు విచక్షణ కల్పించుకుంటాడు. అది గ్రహించినవాడే నిజమైన జ్ఞాని" అని చెప్పాడు.

దూరంగా ఉండి ఈ మాటలు విన్న అస్పృశ్యుడు ఒకడు పురాణం పూర్తికాగానే ధర్మకర్తతో "అయితే, స్వామీ! నన్ను దేవాలయంలోనికి రానివ్వటానికి అభ్యంతరమేమున్నది? తమరు జ్ఞాని కదా! తమకు తేడాలేమీ లేవు గదా!" అన్నాడు.

ధర్మకర్త బిత్తరపోయి "నేను జ్ఞానినే అనుకోరా. ఆలయంలో దేవుడు అనుమతించవద్దా? దేవుడేమంటాడో అడిగి తెలుసుకుంటాను. కొంచెం ఓపిక పట్టు" అన్నాడు.

అస్పృశ్యుడు కొన్నాళ్ళ తరువాత ధర్మకర్త వద్ద ఈ విషయం మళ్ళీ తెస్తే, ఆయన "ఇంకా దేవుడు నాకేమీ చెప్పలేదురా!" అన్నాడు.

మరి కొన్నాళ్ళ తరువాత మళ్ళీ యిద్దరూ కలుసుకొన్నప్పుడు ఆయన "నీ కోరిక విషయం దేవుణ్ణి ఎన్నిసార్లు అడిగినా, దేవుడు ఏమీ చెప్పకుండా ఉన్నాడురా!" అన్నాడు.

దానికి అస్పృశ్యుడు "ఆ మాట దేవుడు నాతోనే స్వయంగా చెప్పేశాడు లెండి" అని జవాబిచ్చాడు.

ధర్మకర్త ఆదుర్దాగా "ఏం చెప్పాడేమిటి?" అని అడిగాడు.

"ఓరె, ఆ గుడిలోకి నన్నే రానివ్వటం లేదు. నిన్నెందుకు రానిస్తార్రా?' అని దేవుడు నాతో అన్నాడండి" అన్నాడు అస్పృశ్యుడు.

---

శ్రీకృష్ణ భగవానుడు తన స్పర్శతోనే కుబ్జలోని త్రిగుణాలనూ హరించివేశాడు.

\- కాళీప్రసాద బాబు

# అపరోక్షానుభూతి

-పరాశర ప్రసాద్

(పూజ్యపాద 108 దండి నిర్మలానంద స్వామివారి బోధ ఆధారంగా)

భగవానుని ఉనికిని విశ్వసించి పూజ, ఆరాధన మొదలైన కార్యక్రమాలలో పాల్గొని ఆనందించటం ప్రత్యక్షానుభూతి. యజ్ఞయాగాదుల్లో పాల్గొనవచ్చు, తీర్థయాత్రలు చేయవచ్చు క్షేత్రజ్ఞులను దర్శించవచ్చును. అలా కాకుండా మహాత్ముల బోధలను శ్రవణం చేయటం ద్వారాగాని గ్రంథ పఠనం ద్వారాగాని భగవంతుడున్నాడని విశ్వసించి వాటిద్వారా భగవంతుని గూర్చిన అనేక విషయాలు తెలుసుకొని జ్ఞానాన్ని పొందవచ్చును.

ఇది కేవలం పరోక్ష జ్ఞానం. దీని ద్వారా ఆర్జించిన పుణ్యఫలము రాశీభూతమై ఉత్తమ గతిని పొందవచ్చును. చేసిన సుకృత కర్మ ఎన్నడూ వృథాకాదు. అయితే జన్మరాహిత్యాన్ని పొందాలంటే జనన మరణ విషవలయం నుంచి విముక్తి కలగాలి. దానిని సాధించాలంటే దృఢ అపరోక్ష జ్ఞానము పొందవలసిందే. అపరోక్షానుభూతి అంటే నీ సంగతి నువ్వు తెలుసుకోవాలి. మానవుడు ఎక్కడి నుంచి వచ్చాడో అక్కడికి చేరుకుంటేనే ఆనందం. ప్రాపంచిక ఆనందం అశాశ్వితమైనది, నికృష్టమైనది.

ఏదైనా పొందుతాము అని తెలియగానే పొందే ఆనందం ప్రియము. పొందేముందు కలిగిన ఆనందం మోదము. పొందిన తరువాత అనుభవించేది ప్రమోదము. అది కేవలం తాత్కాలికమైనది. ఆ తరువాత మళ్ళీ యింకొక విషయముపై మనసు మరలుతుంది. కానీ ఆత్మానందం పరమానందం. ప్రకృష్టమైనది. శాశ్వతమైనది. దానిని జ్ఞాన సమాధి ద్వారా మాత్రమే పొందగల్గుతారు. జ్ఞాన సమాధిలో ఆనందాన్ని పొందేవాడు నిజమైన సన్యాసి. అంతేకాని కాషాయ వస్త్రాలు, ముండిత శిరస్సు చేత గుర్తించ బడడు.

యోగ సమాధి ద్వారా తాత్కాలికంగా ఆనందాన్ని పొందవచ్చు. మనస్సు నిశ్చల స్థితిని పొందవచ్చు. ఆ సమయంలో యింద్రియాలు అచేతనమై ఉండవచ్చు. అది తాత్కాలికమైన యోగ సమాధి నుంచి బయటకి రాగానే మనస్సు సంకల్పించక మానదు.

మనం యింటికి చేరుకుంటే ఆనందం. జీవుడు ఎక్కడ నుంచి వచ్చాడు? మాతృగర్భం నుండి వచ్చాడు అనుకుందామా? ఎన్నటికీ కాదు.

జీవుడు అనాది. జీవుడికి ఇంద్రియాలకి శక్తి నిచ్చేది చైతన్యము లేక ఆత్మ వస్తువు. ఇంద్రియాలు గోళకాలు. ఇంట్లోనే సామాన్లు పెట్టుకునే గూడులు ఎంతో ఇవీ అంతే. మానవ శరీరం ఆ భగవానుడు ప్రసాదించిన యంత్రం. శరీరంలో ఆత్మ ఉంది అంటారు. అది తప్పు. చైతన్యం లోపల బయట అంతటా వ్యాప్తమై ఉంది. చైతన్యంలో శరీరం ఉంది. చైతన్యం తప్పుకోవటానికి స్థలం లేదు.

అపరోక్షానుభూతిని శాస్త్రీయంగా పరిశీలిస్తే దానిలో 4 అంశాలు ఉన్నవి. అధికారి, విషయము, సంబంధము, ప్రయోజనము. అపరోక్షానుభూతికి అధికారి సగుణ సంపన్నుడు. అంటే ఆసక్తిగలవాడు, ఆకలిగొన్నవాడు. మంచి గుణము  ఉంటే చాలదు. శ్రవణం చేయటానికి వద్దామని అనుకున్నంత మాత్రం చాలదు కదా! పోనీ శ్రవణానికి వచ్చినంత మాత్రాన చాలదు కదా! శ్రద్ధగా శ్రవణం చేయాలి కదా! శాస్త్ర జ్ఞానం, శబ్ద జ్ఞానం ద్వారా అపరోక్షానుభూతి కలగదు.

అందరూ కళ్ళజోడు పెట్టుకుని చదువుతున్నారని ఒక వ్యక్తి కళ్ళజోళ్ళ షాపుకి వెళ్ళి కళ్ళజోడు కావాలన్నాడు. సాయంత్రం వరకు ఎన్నో కళ్ళజోళ్ళు పరిశీలించాడు. ఏది పెట్టుకున్నా చదవలేకపోయాడు. చివరికి షాపువాడు "బాబూ! నీకు చదువు వచ్చా?" అని అడిగాడు. ఆ వ్యక్తి సమాధానం చెపుతూ చదువు వస్తే కళ్ళజోడు ఎందుకయ్యా? అన్నాడు. అలాఉంటుంది శబ్ద జ్ఞానం.

మనది కర్మ భూమి. ఈ కర్మభూమిలో పుట్టి ఉత్కృష్టమైన మానవ జన్మ ఎత్తిన సార్థకతని తెలుసుకోలేక పోవటం. ఎంత అవివేకమంటే బంగారు నాగలితో పొలము దున్ని, జిల్లేడు మొక్కలు పంటపొలంలో పండించినట్లుందని భర్తృహరి చెప్పాడు. అంతేకాదు మణులు పొదిగిన బంగారు పాత్రలో గంధపు చెక్కలు వంటచెరకుగా వాడి తెలగపిండి కూరతయారు చేస్తాడట. అది వివేకవంతుడు చేసే పనియేనా?

మనస్సు బంధానికి మోక్షానికి రెండింటికి కారణమవుతుంది. ఇంటికి తాళం వేయటానికి తాళం తీయటచానికి ఒకే తాళం చెవి ఎలా వినియోగ పడుతుందో ఇది కూడా అంతే. శరీరము జడము దానికి బోధతో పనిలేదు. చైతన్యము బోధకి ఆధారము. కాబట్టి దానికి బోధ అవసరం లేదు. బోధ కావలసినది మనస్సుకే.

-సశేషం

# బెంగుళూరులో శ్రీ మాతాజీ సత్సంగం

## సుందరకాండ

-రమణ ప్రసాద్

(సమర్థ మారుతి సమర్థ విశ్వేశ్వరుడు రత్న గర్భ వినాయకుడు, శ్రీలలితా రాజరాజేశ్వరి విరాజమానమై ఉన్న శ్రీమారుతి దేవాలయం, జ్యోతినగరం, బెంగుళూరులో శ్రీమాతాజీవారు చేసిన అనుగ్రహ సంభాషణ)

అంజనానందం వీరం జానకీ శోకనాశనం।
కపీశమక్షహంతారం వందే లంకాభయంకరం ॥

శ్రీ ఆంజనేయ స్వామిని గుర్తుకు తెచ్చుకుంటే మనకు ఇంకే దేవుడు గుర్తుకు వస్తాడు? శ్రీరామచంద్ర ప్రభువు. శ్రీఆంజనేయుడు శివాంశ సంభూతుడు. ఆయనది దాస భక్తి. ఆయన ఒక్కసారి 'రామ' అంటే 33కోట్ల రోమాలు 'రాం' అని స్పందించేవి అనేవారు శ్రీగురుదేవులు.

సుందరకాండలో రాముడు సుందరుడు, సీత సుందరి, ఆంజనేయుడు సుందరుడు. సుందరకాండ కథ సుందరం. అటువంటి సౌందర్యమే సుందరకాండ పారాయణ చేసిన వారికి తొరుకుతుంది.

కిష్కింధకాండలో ఆంజనేయుడు సుగ్రీవునికి మంత్రిగా పరిచయమవుతాడు. ఎవరో నరులు కిష్కింధలో ప్రవేశించారని తెలిసి ఆంజనేయుని తెలుసుకుని రమ్మని సుగ్రీవుడు పంపాడు. ఒక చెట్టు మీద నుంచి వారి రాకను గమనించి, బ్రాహ్మణ రూపంలో వారిని కలుస్తాడు. శ్రీరాముడు ఆప్యాంగా "హనుమా!' అని సంబోధిస్తాడు. ఎవరైతే "హనుమా' అని సంబోధిస్తారో ఆయననే ప్రభువుగా గుర్తించు అన్న మాటలు గుర్తుకువచ్చిశ్రీరామునికి సాష్టాంగ ప్రణామం చేస్తాడు. రామలక్ష్మణులు సీతను వెతుకుతూ కిష్కింధలో ప్రవేశించారని తెలుసుకున్న వాడై సుగ్రీవునితో మైత్రి కలుపుతాడు. అగ్ని సాక్షిగా సీతను వెదకటానికి సహాయం చేస్తానని వాగ్దానం చేస్తాడు సుగ్రీవుడు. బదులుగా శ్రీరాముడు వాలిని సంహరిస్తానని యిచ్చిన మాట నెరవేర్చుకుంటాడు.

మనం ఎప్పుడూ భగవత్సేవలోనే ఉండాలి. కులశేఖర మహారాజు మకుందమాలలో.................

మజ్జన్మనః ఫలమిదం మధుకైటభారే
మత్ప్రార్థనీయ మదనుగ్రహం ఏషఏవ
త్వద్భృత్య భృత్య పరిచారక భృత్య భృత్య
భృత్యస్య భృత్య ఇతి మాం స్మర లోకనాథ!

"ప్రభూ! నా ప్రార్థన యిదే. నీ భృత్యుని యొక్క భృత్యుని పరిచారకుని సేవకుని సేవకుడుగా నన్ను అనుగ్రహించు. అదే మానవ జన్మ సార్థకత. భగవంతుడు శాశ్వతుడు. భగవంతుని ఆశ్రయించిన భక్తుడు శాశ్వతుడు. నా మీద అనుగ్రహంతో అట్టి భావనను నాకు కలుగుజెయ్యి'' అని రాజైన కులశేఖరులు శ్రీరంగనాథ స్వామిని ప్రార్థించారు.

**దాసోऽహం** అనే భక్తి భావన ఉంటే **సోऽహం** అనే జ్ఞానం లభిస్తుంది. 'దృష్టిప్రసార మాత్రేణ బహుళాపన్ననివారకాయ నమః'. ఆంజనేయుని దాస భక్తిని ఒక్కసారి మనస్సులో ముద్రించుకుంటే మన మనస్సు ఆంజనేయునిపై నిలిచిపోతుంది.

సుగ్రీవుడు సీత జాడ తెలుసుకుని రమ్మని వానరులందరినీ నలుదిక్కులా పంపాడు. ఎంత వెదికినా సీత జాడ తెలియలేదు. సముద్రానికవతల లంకలో ఉండవచ్చునని తెలిసింది. నూరు యోజనాలు దాటితేకాని లంకను చేరుకోలేము అన్న విషయాన్ని తెలిసిన జాంబవంతుడు హనుమంతుని వద్దకు వచ్చి, 'సీతమాత జాడ తెలుసుకోవటానికి నువ్వు ఒక్కడివే సమర్థుడవు'' అని చెబుతాడు. ఆంజనేయుడు తన శరీరాన్ని పెంచి వాయువును కుంభించి 'శ్రీరాం' అంటూ తాను నుంచుని ఉన్న గంధమాగధ పర్వతాన్ని బలంగా కాలితో తన్ని లంఘించాడు.

మనం సత్వరజస్తమో అనే మూడు గుణాలతో బాధ పడుతున్నాము. సత్వీగుణం ఉత్తమం అంటారు. సత్వగుణం ప్రకాశించాలంటే కాస్త రజోగుణం కూడా కావాలి. కాస్త నిదానం అవసరమైతే తమో గుణం ఉండాలి.

ఆంజనేయుడు సముద్రాన్ని దాటటానికి ప్రాణ రూపంలో ఉన్న వాయువు కారణం. మన ఆయుష్షు మన ఉచ్ఛ్వాస నిశ్వాసలపై ఆధారపడి ఉంది. వాటి నియంత్రణ ద్వారా మన ఆయుష్షును పెంచుకోవచ్చు. వసిష్ట మహర్షి శ్రీమహావిష్ణువు రాముడిగా అవతరిస్తున్నాడని ఆయనకు దర్శనం, ఆయనకు గురువుగా ఉండే భాగ్యం లభిస్తుందని బ్రహ్మద్వారా తెలుసుకొని కొన్ని యుగాలు తన ఆయుష్షును పెంతుకుని శ్రీరామ అవతారానికై వేచి ఉన్నాడు.

-సశేషం

# మాణిక్య వాచకార్

- సుషుమ్న ప్రసాద

పెరియ పురాణములోని శికజార్ తమిళ శివఋషి పుంగవులైన అరవైముగ్గురికి పరమశివుని పట్ల ఉన్న మహత్తరమైన భక్తిని ఘనంగా కీర్తించి, శ్లాఘించారు. వారిలో సద్గురు చతుష్టయంగా పేర్కొన్న వారిలో మాణిక్య వాచకార్, ప్రముఖులు. మిగిలిన ముగ్గురు మహనీయులు 'అప్పార్, సుందరార్, తిరుజ్ఞాన సంబందార్'లుగా పేర్కొన్న బడ్డారు. వీరంతా తమిళనాడు దేవాలయంలో వెలసిన పరమశివుని అసంఖ్యాకమైన పద్యాలలో కీర్తించారు. ఈ పద్య సముదాయమును రచించినవారిని పన్నిరు తుమురాయి (ద్వాదశ స్తోత్రములు) అంటారు. వాటిని దేవాలయములో పఠించేవారు. మాణిక్య వాచకార్ రచించిన తిరువాచకము ఆ ద్వాదశ స్తోత్రములలో ఒకటి.

మదురై నగరమునకు సమీపమున ఉన్న వడవూరు గ్రామములో ఉన్న అముత్య బ్రాహ్మణుల వంశములో జన్మించాడు మాణిక్య వాచకార్. వారు వంశపారంపర్యంగా పాండ్యరాజుల ఆస్థానంలో అమాత్యులు అంటే మంత్రులుగా ఉండేవారు. మాణిక్యవాచాకర్‌ది సార్థక నామధేయం.

పరమ శివుడు స్వయంగా ఒక బోధకుని రూపంలో ఆ గ్రామానికి వచ్చి మాణిక్యము వంటి కంఠస్వరము కలవాడని ఆపేరు పెట్టారు. వడవోరార్, గురుమణి పాదారవిందములకు సాష్టాంగ నమస్కారము చేసి స్వామి ఆశీస్సులు కోరారు. ప్రభువైన పరమశివుడు ఆయనను సున్నితంగా లేవనెత్తాడు. వెంటనే అతనిలో ఉన్న కవితా ప్రతిభ వెల్లువై ప్రవహించి, స్వామిని స్తుతించే పద్యమాలికా రూపములో వెలువడింది. వెంటనే పరమశివుడాదేశించాడు 'ఓ మాణిక్యవాచాకర్! ప్రజలందరిని భగవదభిముఖులను చేసి, నీ కీర్తనలతో వారికి ఆధ్యాత్మికోన్నతిని ప్రసాదించి, చిదంబరంలో నన్ను చేరుకో.''

వడవోరార్ ప్రతిభ మదురైకు వ్యాపించి, ఆ రాజ్యాన్ని పాలించే అరిమర్థన పాండవ అనే రాజు అతనిని ఆ రాజ్యానికి ముఖ్యమంత్రిగా రమ్మనమని ఆహ్వానించాడు. ఒకరోజు ఆ రాజ్య అశ్వశాల కాపలాదారులు ప్రభువు వద్దకు వచ్చి, రోజు రోజుకూ వృద్ధాప్యముతో అశ్వముల సంఖ్య క్షీణిస్తున్నదని ఫిర్యాదు చేశారు. రాజుగారు వడవోరారును పిలిపించి,

సముద్రతీర పట్టణమున బస చేసియున్న అరబ్బీ వర్తకుల వద్ద నుండి కొత్త గుఱ్ఱములను కొనుగోలు చేయమన్నాడు. రాజాజ్ఞమేరకు తమ తీరపట్టణమునకు వెళ్తుండగా ఒక సత్సంగ సమావేశములో పాల్గొన్నాడు. అందులో ఒక శివభక్తుడు శిథిలమైన శివాలయమును పునరుద్ధరించుటకు రాజుగారి సహాయము కావాలని కోరాడు. వాని అభ్యర్థనకు కరిగిపోయి, వడవోరారు తను గుఱ్ఱములను కొనుగోలు చేయటానికి తెచ్చిన బంగారు నాణెములను పెరుంద్రాయి గ్రామములోని శివాలయ పునరుద్ధరణకు వినియోగించాడు.

అలా రోజులు గడిచిపోతున్నాయి. ఒక మాసము గడువు కోరిన వడవోరారు వద్ద నుండి  గుఱ్ఱములను గురించి ఎలాంటి సందేశము రాక, రాజాపరాధానికి గురి అయ్యాడు. గడువు గడిచిపోయిన రాజధానికి ఒక్క అశ్వము వచ్చిన జాడ కూడ లేదు. రాజుగారు ఆగ్రహించి వెంటనే వడవోరారును బందీచేసి, కఠినంగా శిక్షించమని ఆజ్ఞ జారీచేశాడు.

తీవ్రమైన వేదనకు లోనైన మాణిక్య వాచకార్ పరమేశ్వరుని స్తుతిస్తూ యెన్నో పద్యాలను రచించాడు. అతని భక్తి విశ్వాసాలకు మెచ్చిన పరమేశ్వరుడు వెంటనే అక్కడ ఉన్న నక్కలను గుఱ్ఱాలుగా మార్చి మదురై రాజాస్థానమునకు తీసుకువచ్చాడు. ఒక గుఱ్ఱముపై పరమేశ్వరుడు స్వయంగా తానే స్వారీచేస్తూ వచ్చాడు. పరమేశ్వరుడు రాజుగారితో గుఱ్ఱములను అందిచటంలో కొంత జాప్యము  జరిగిందని, మాణిక్యవాచకార్ నిర్దోషియని చెప్పాడు. వెంటనే రాజుగారు ముఖ్యమంత్రిని చెరనుండి విడిపించమని, క్షమాపణకోరి, తన తప్పిదాన్ని మన్నించమన్నాడు.

ప్రభువైన పరమశివుడు మరికొంత సేపు తమాషా చేస్తే బాగుంటుంది అనుకొని ఆరాత్రికి రాత్రే గుఱ్ఱాలను నక్కలగా మార్చేశాడు. ఆ నక్కలు అశ్వశాలలో ఉన్న అశ్వాలను మ్రింగేసి, పారిపోయాయి. రాజుగారు ఆవేశాన్ని పట్టలేకపోయాడు. తనను మోసానికి గురిచేసిన మాణిక్యవాచకార్‌ను వైగైనది తీరాన ఇసుకలో మండుటెండలో ఒక బండరాయిని నెత్తిన పెట్టి నిలబెట్టమన్నాడు. ఈ ఋషిపుంగవుడు ఈ కఠిన శిక్షను కించిత్తైనా చలించకుండ అనుభవించాడు.  ఎందుకంటే అతను పరమ శివుని భక్తిపారవశ్యములో సర్వమూ విస్మరించాడు.

-సశేషం

# త్యాగి

- రావి శోభ

ఊరికి దూరంగా ఉన్న కొండ మీద ఒక సాధువు చిరకాలంగా తపస్సు చేసుకుంటూ ఉన్నాడు. వాని తపోనిష్ఠకి మెచ్చి భగవంతుడు వాని ఎదుట సాక్షాత్కారించాడు. దైవదర్శనంతో సాధువు పరమానంద భరితుడైనాడు. "ఏం కావాలి నాయనా?" అన్నాడు దైవం పరమ ప్రీతితో. "ప్రభూ! నాకు ముక్తి కావాలి" అన్నాడు సాధువు. భగవంతుడు "వత్సా! నీకు మోక్షప్రాప్తికి ఇంకా సమయం మిగిలే ఉంది గనుక ఈలోగ ఏదైనా వరం కోరుకో ఇస్తాను" అన్నాడు. సాధువు చేతులు మోడ్చి "ఐహికాన్ని విసర్జించి, సర్వసంగ పరిత్యాగినై తపస్సు చేసిన నాకింకా కోరికలు వరాలు ఏమిటయ్యా?" అన్నాడు. పరమాత్మ "నేనాడి తప్పని వాడిని గనుక వరం యిచ్చి తీరవలసిందే" అన్నాడు.

అరక్షణం ఆలోచించిన పిమ్మట "పరోపకారార్థం ఇదం శరీరం' అన్నారు కనుక నాశేష జీవితం లోకోపకారినై గడిపేట్లుగా వరం ఇవ్వు" అన్నాడు సాధువు. పరమాత్మ సంతుష్టుడై 'అలాగే కానీ' అంటూ వెనుతిరిగబోయేంతలో సాధువు "స్వామీ! ఆగు నేను చెప్పేది విను. తెలిసి నేను ఏ కార్యం చేసినా నాలో అహం పెరిగి అది పతనానికి దారితీస్తుంది కనుక నాకు తెలియకుండానే లోకానికి నావలన మేలు జరగాలి. ఇలాగ నీవిచ్చే వరం నాకు ఫలప్రదం అవుతుంది" అన్నాడు. పరమాత్మ చిరునవ్వుతో "సరే. ఇకనుంచి నువ్వు సర్వతీర్థాలూ, పుణ్యప్రదేశాలూ, క్షేత్రాలూ పర్యటిస్తూ దృఢభక్తి వైరాగ్యాలతో నిరంతర దైవధ్యానంతో జీవిస్తూ అంత్యకాలం సమీపించినప్పుడు నాలోనే ఐక్యం అయిపోతావు" అని ఆశీర్వదించి అంతర్ధానమయ్యాడు.

సాధువు భగవదాజ్ఞమేరకు సర్వప్రదేశాలలోను సంచరిస్తుంటే వానికి తెలియకనే అతడు నడిచినంతమేరా వెనుక భాగాన వాని నీడలో మోడులు చిగిర్చేవి. వ్యాధిగ్రస్తులు రోగవిముక్తులు అయ్యేవారు. జనానికి తాప శాంతి కలిగేది. ఏడ్చే పసిపాపలు కిలకిల నవ్వుతూ పరుగులు పెట్టేవారు. కోరికలున్న వారికి అవి నెరవేరుతూ ఉండేవి. ఈ లాభాలను గుర్తించిన ప్రజలు వాని నీడలో సేదతీరుతూ ఉండేవారు. అయితే ఆ సాధువు మాత్రం తనదైన భగవచ్చింతనలోనే నిమగ్నుడై ముందుకు సాగిపోయేవాడు. ఎవరేమి చెప్పినా పట్టించుకోకుండా జీవదృష్టిని వదిలి పరమాత్మయందే మనస్సుని నిలిపిన ఆ సాధువు అనతికాలంలోనే పరమేశ్వరుడిలో లీనమైపోయాడు. మహాత్ములు కాలిన తాడువంటివారు. వారిని ప్రపంచవిషయాలేమీ బంధించలేవు. *

(గతసంచిక తరువాయి)

# విష్ణు  కథలు

-రమణ ప్రసాద్

దర్శనమాత్రం చేతనే సర్వదోషాలను పోగొట్టగల కుక్కుటముని ప్రభావాన్ని ఏమని చెప్పగలం?'' అన్న గంగాదేవితో పుండరీకుడు, " మీ సర్వపాపాలను నిగ్రహించు శక్తి ఆ మహాత్మునికి ఎలా కలిగింది? అని అడిగాడు. దానికి గంగాదేవి,**''న మాతుః పరమదైవతమ్,** అనియు,**మాతృదేవోభవ,** అనియు ఆరుసార్లు భూ ప్రదక్షిణ చేసే ఫలితం మాతృ వందనంతో వస్తుంది అని తెలిసినవాడై మాతా పితరుల శుశ్రూష చేస్తున్నాడు. అది తప్ప వేరే తపస్సు చేయలేదు, ఏ పుణ్యతీర్థాలలో మునుగలేదు, ఏ యాగము చేయలేదు, ఏదీ మాతా పితరుల కైంకర్యానికి సాటి రాదు. భూమికంటే ఉత్తమస్థానం తల్లిది, ఆకాశానికంటే ఉత్తమస్థానం తండ్రిది అని శాస్త్రవేత్తలు చెపుతారు''' అని చెప్పింది. గంగాదేవితో పుండరీకుడు, "తల్లీ! సకల పుణ్యాలు చేయటానికి సాధకమైన మానవజన్మను నిరర్థకం చేసికొన్నాను. నా పాపాలు ఎలా నిర్వర్తింపబడతాయి? అని విలపిస్తున్న పుండరీకునితో గంగాదేవి,"ఓరీ పాపాత్ముడా! ఇకనైనా మాతా పితరుల సేవ చేస్తే నీ సకల పాపాలు తొలగి పోతాయి. నీకు శ్రీమన్నారాయణమూర్తి కృప కలుగుతుంది'' అని చెప్పి వెళ్ళిపోయింది.

ఆ తర్వాత పుండరీకుడు కుక్కుటముని వద్దకు వచ్చి ఆ మునీశ్వరునికి నమస్కరించి, తన భార్యతో కలిసి తల్లి దండ్రులను వెతికి పట్టుకుని వారిని గుఱ్ఱములమీద ఎక్కించి, కాశీకి పోయి, వారిని పుణ్యనదులలో స్నానం చేయించి, తిరిగి తమ ఊరికి వచ్చి స్వగృహంలో తలిదండ్రులకు శుశ్రూష చేస్తున్నాడు. కాలంగడుస్తోంది.

ఇది ఇట్లా ఉండగా దేవేంద్రుడు వృత్తుడను రాక్షసుని తల వజ్రాయుధంతో ఖండించాడు. వృత్రాసురుడు, " నేను తపస్సు చేసే సమయంలో నా తల నరికావు కనుక నీవు ఇటుకరాయివై భూమిపై పడి ఉండ''మని శపించాడు. అప్పుడు ఇంద్రుడు శ్రీహరిని స్తోత్రం చేయగా, శ్రీహరి ప్రత్యక్షమై," నీవు పుండరీకాశ్రమమునందు ఇటురాయివై ఉండు. నేను నీపై

నిల్చినప్పుడు నీకు శాపవిముక్తి కలుగుతుంది'' అని చెప్పి అంతర్ధానమైనాడు. అప్పటి నుండి ఇంద్రుడు ఇటుకరాయి రూపంలో డిండీర వనంలో పడి ఉన్నాడు. ఆ రాయి పడినచోట డిండీరనగరం ఏర్పడింది. ఆ నగరంలోనే పుండరీకుని గృహం ఉంది.

ఒకనాడు పుండరీకుడు తల్లిదండ్రులకు శుశ్రూష చేస్తుండగా, భగవానుడు దర్శనము ఇవ్వాలని వచ్చి పాదముల నూపురములు చప్పుడు చేసి, మొలనున్న కింకిణుల మోతలు మ్రోగునట్లుచేసి, అతడు చూచునట్లు వెనుక నిలుచున్నాడు. పుండరీకుడు తన తిదండ్రులకు నమస్కరించుచుండగా, భగవానుని మహారత్న నీల ప్రభ కాంతి అతనిముందు పడగా, అతడు తల ఎత్తిచూశాడు. ఆ దివ్యతేజోమూర్తి దర్శనం అయింది. పుండరీకుడు తన తల్లిదండ్రులకు చేసే శుశ్రూషకు భంగం రాకూడదని, అచట పడి ఉన్న ఇటుకరాతిని విసరి " దీనిపై నిలబడి ఉండు. నా కైంకర్యం పూర్తి చేసికొని వస్తాను'' అని చెప్పాడు. భగవంతుడు ఇటుకరాయిగా ఉన్న ఇంద్రునిపై నిలిచి, నడుమున చేతులు ఉంచుకొని,పుండరీకుడు చేయు సేవలను గమనిస్తున్నాడు. ఇంద్రునికి శాపవిముక్తి కలిగింది. పుండరీకుడు తల్లిదండ్రుల సేవ పూర్తి చేసికొని పీతాంబరధారి అగు శ్రీకృష్ణమూర్తికి సాష్టాంగ సమస్కారంచేసి అనేక విధాలుగా నుతించాడు. " పుండరీకుని వలె తల్లి దండ్రులను సేవించువారు ఇంకొకరు లేరు. " వరము ఇస్తున్నాను కోరుకో" అన్నాడు భగవంతుడు.

పుండరీకుడు స్వామిని చూసి " స్వామీ! నీవు త్రిమూర్తిస్వరూపుడవు. "విఠల్'' అనే పేరు కల రాయిపై నిలిచావు. కావున "విఠలమూర్తి అను పేరుతో ఇక్కడ ఎల్లకాలం వసించి, నీ దర్శనానికి వచ్చిన భక్తుల సకలపాపాలను నివృత్తి చెయ్యి. నీ పేరుతో ఈక్షేత్రం పుండరీకపురం (పండరిపురం) అనే పేరుతో ప్రసిద్ది అయి, నివు పుండరీక వరదుడవుకాన 'పాండురంగడు' అని పిలువబడినట్లు అనుగ్రహించు. ఈ క్షేత్రం సకల తీర్థాలకంటె ఉత్కృష్టమైన తీర్థంగా చేసి, అందు స్నానం చేయువారలు పరిశుద్ధులగునట్లు చెయ్యి''ఇదే నా కోరిక.

భగవంతుడు సంతోషించి,"నీవు చెప్పినట్లే అన్నీ అగుగాక! త్రిలోకములలోని తీర్థాలు ఇచటకు వచ్చి చేరును. ఈ నది శ్రీకృష్ణమందిరాన్ని సమీపించి చంద్రవంక లాగా దక్షిణదిశనుండి తూర్పుదిక్కుగా ప్రవహించుచున్నది కనుక ఈ నది "చంద్రభాగ'' అని పిలువబడుతుంది.

లక్ష్మీదేవి భగవంతుని వియోగాన్ని ఓర్వలేక దివ్యవస్త్ర రత్నాభరితయై విఠ్ఠలమూర్తి ఎడమ ప్రక్క నిలిచింది. శ్రీకృష్ణమూర్తి కృపా విశేషంచేత శాపవిముక్తుడైన దేవేంద్రుడు మయుని పిలిచి విష్ణుచక్రం పండరిపురముగాను, దాని నడుమ బిందు తీర్థాన్ని, దానిమధ్య విఠళ్ అను పేరుగల పీఠాన్ని నిర్మింపచేశాడు. ఆనాటినుండి మునులు, భక్తులు వచ్చి విఠలనాథుని, రఖమాబాయిని సేవించుచుండిరి.

## శ్రద్ధాంజలి

శ్రీ సద్గురు మహాసౌరయాగం ఐదవ రోజు ది.30.1.2012 సోమవారం నాడు జరిగిన శ్రీసద్గురు పాదపూజలో శ్రీ వి.వి.యస్.మూర్తి గారు భాగ్యనగర శాఖకు చెందిన తదితర భక్తులతో శ్రీమాతాజీవారికి పసుపు కుంకుమలు సమర్పించి, నమస్కరించుకొని బయటకు వచ్చి తీర్థ ప్రసాదాలు స్వీకరించి తనతో పాటు వచ్చిన శ్రీమనోజ్‌కుమార్, శ్రీ గోపాలరావుగార్లతో ఆటో ఎక్కి ఆశ్రమానికి తిరిగి వస్తూ గుండెపోటుతో శ్రీ సద్గురు సాయుజ్యాన్ని పొందారు. వారి పార్థివ శరీరానికి ది. 31.1.2012 మంగళవారం నాడు ఆశ్రమంలో అంతిమక్రియలు జరిగినవి.

శ్రీ వక్కలగడ్డ వెంకట సత్యన్నారాయణమూర్తి (శ్రీ వి.వి.యస్. మూర్తి)గారి వయస్సు 73 సంవత్సరాలు. వారు శ్రీబాబూజీ మహరాజ్ వారి ప్రియభక్తులు. వీరు హైదరాబాద్‌లోని పాల్‌టెక్నిక్ కాలేజీకి ప్రిన్సపాల్‌గా పనిచేసి రిటైర్ అయ్యారు. వీరు శ్రీకాళీవనాశ్రమానికి, హైదరాబాద్, పెదనింద్రకొలను ఆశ్రమ శాఖలకు తమ అనన్య సేవలను అందించారు. వీరికి భార్య, ఒక కుమారుడు, ఒక కుమార్తె కలరు. శ్రీ గురుదేవులు వీరికి ఆత్మ శాంతిని ప్రసాదించెదరు గాక. వీరి కుటుంబ సభ్యులకు, బంధు మిత్రులకు మా ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నాము.

Printed, Published by C.V. Ramana Babu, on behalf of YOGINI SRI CHANDRA KALI PRASADA MATHAJI CHARITABLE TRUST and Printed at Samardha Sadguru Publications, D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh, and published at D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh. Editor - DUGGIRALA JAGANMOHANA BALA KRISHNA LAL